
Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 01.05.2015, శుక్రవారం సంపుటి : 34 సంచిక : 48 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

## మరుభూమిగా మారిన ధర్మభూమి



# నేపాల్... నేలపాలు

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన హిమాలయాల్లో అత్యంత సుందరమైన దేశంగా ప్రసిద్ధి చెంది, ఎల్లవేళలా ప్రకృతి ఒడిలో పరవశించే నేపాల్‌ను పెను భూకంపం కబళించింది. ఏప్రిల్ 25వ తేదీ ఉదయం 11.56గంటలకు వచ్చిన పెనుభూకంపం ధాటికి నేపాల్ విలవిలలాడింది. వేలాదిమంది ప్రజలు ఈ భూకంపానికి బలయ్యారు. ఎన్నో ప్రసిద్ధమైన చారిత్రక కట్టడాలు, యాత్రాస్థలాలు, పెద్దపెద్ద భవంతులు నేలమట్టమయ్యాయి. ఎంతో వ్యయంతో నిర్మించుకున్న మహాసౌధాలే ఎంతోమంది పాలిట సమాధులయ్యాయి. ఈ మహావిపత్తుతో ఆ దేశం అతలాకుతలమైపోయింది. ఆదుకునే ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తోంది. (మిగతా 10వ పేజీలో)

## ఏపిపై బీజేపీకి..
# కనపడని 'ప్రత్యేక' శ్రద్ధ




### ▸ రాజకీయ జూదంలో రాష్ట్ర ప్రయోజనాలు

**కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్, సిపిఐ... 13జిల్లాలతో మిగిలిన ఆంధ్రప్రదేశ్‌కు ఈ పార్టీలన్నీ ద్రోహం చేశాయి. రాష్ట్ర విభజన జరగడానికి, విభజన జరిగాక ఆంధ్రప్రదేశ్ అప్పుల్లో, అవస్థల్లో కూరుకుపోవడానికి ఈ పార్టీలన్నీ కారణమే! గత యూపిఏ ప్రభుత్వంలో అర్థంపర్థం లేకుండా అడ్డగోలుగా చేసిన రాష్ట్ర విభజనకు ఈ పార్టీలన్నీ గుడ్డిగా మద్దతు తెలపడం వల్లే ఈరోజు ఆంధ్రప్రదేశ్‌కు అప్పులు, అవస్థలు మిగిలాయి.**

విభజన పాపంలో తొలిముద్దాయి కాంగ్రెస్‌పార్టీ. ప్రధాన నిందితురాలు సోనియాగాంధీ. మొన్నటి విభజన తీరు చూసిన ఈతరం వారెవ్వరు కూడా తమ జీవితకాలంలో కాంగ్రెస్‌ను, సోనియాను క్షమించలేరు. వాళ్ల విషయం పక్కనపెడితే ఇప్పుడు అధికారంలో వున్న ఎన్డీఏ ఆంధ్రప్రదేశ్ విషయంలో వ్యవహరిస్తున్న తీరు ఇంకా బాధ కలిగిస్తుంది.

యూపిఏ తయారు చేసిన విభజన బిల్లును తప్పు పట్టింది అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీయే. ఆనాటి బిల్లుకు సవరణలు ప్రతిపాదించింది, ఏపికి న్యాయం చేయాలంటూ నినదించింది ఆ పార్టీయే. ఏపికి ప్రత్యేక హోదాను 5ఏళ్ల నుండి పదేళ్లకు పెంచాలంటూ రాజ్యసభలో పోరాడింది ఆ పార్టీ నాయకులు యం.వెంకయ్య నాయుడు, అరుణ్‌జైట్లీలే! ఇక నరేంద్రమోడీ అయితే ఏపి మీద ప్రత్యేక సానుభూతి చూపించారు. తెలంగాణ అనే బిడ్డను బయటకు తీసి తల్లి అనే ఆంధ్రప్రదేశ్‌ను చంపారంటూ కాంగ్రెస్‌ను తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. ఆరోజు ఏపి పట్ల బీజేపీ వాళ్లు చూపించిన సానుభూతికి ఆంధ్రాప్రజలు (మిగతా 10వ పేజీలో)

## పురిటిగడ్డపై...
# నెల్లూరు శిఖరాలు

• ప్రగతికి ఆశాదీపం 'నెల్లూరు నెక్స్ట్'




6,7లో

## పేదల ఆసుపత్రికి...
# జివికె పెద్ద కానుక



రేడియాలజీ విభాగాన్ని ప్రారంభించిన వెంకయ్య 12లో



# 'పబ్లిక్' ఆగ్రహం




ఆంధ్రప్రదేశ్ శాసనసభ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఏప్రిల్ 27వ తేదీన జిల్లాలో పర్యటించింది. కమిటీ ఛైర్మెన్ భూమా నాగిరెడ్డి అధ్యక్షతన కమిటీ సభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, బోండ ఉమామహేశ్వరరావు, తోట త్రిమూర్తులు, సురేష్, ఎం.వి.ఎస్.శర్మలు ముత్తుకూరు మండలంలోని కృష్ణపట్నం పోర్టును సందర్శించారు. పోర్టులో 3గంటల పాటు కమిటి సభ్యులు తిరిగారు. పోర్టులో మొక్కలు నాటారు. పోర్టు సిఇఒ అనిల్, పిఆర్‌ఓ వేణుగోపాల్ కమిటీ సభ్యులకు స్వాగతం పలికారు. ఇక్కడనుండి కమిటీ నేరుగా నెల్లూరు కలెక్టరేట్‌కు చేరుకుంది. ఇక్కడ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కమిటీ ఛైర్మెన్ భూమా నాగిరెడ్డి కృష్ణపట్నం పోర్టుకు సంబంధించిన వివరాలడిగారు. పోర్టుకు ఎన్ని ఎకరాలిచ్చారు, ఎన్ని సంవత్సరాలు లీజుకిచ్చారు, ఎంత లీజు చెల్లిస్తున్నారు, సిఎస్ఆర్ నిధులు ఎక్కడ ఖర్చు చేస్తున్నారు, ప్రభుత్వానికి పోర్టు ద్వారా గతంలో ఎంత ఆదాయం వస్తుండేది, ఇప్పుడెంతొస్తుంది అంటూ టపీ టపీమని ప్రశ్నలు వేశారు. దీనికి సమాధానం చెప్పలేక అధికారులు నీళ్లు నమలడంతో భూమా నాగిరెడ్డి ఆగ్రహించారు. సమాచారం లేకుండా సమావేశానికి ఎందుకొస్తారని, మేనెల హైదరాబాద్‌లో జరిగే కమిటీ సమావేశానికి అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని భూమా నాగిరెడ్డి ఆదేశించారు.

ఈ సమావేశంలో కలెక్టర్ ఎం.జానకి, జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్‌లు కూడా పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# ఆనందించాలా? ఆలోచించాలా?

## హడ్కో నిధుల వల్ల ప్రయోజనం అంతంతే!

**ఒక బ్యాంకు నుండి పాతిక లక్షలు అప్పు తెచ్చుకున్నామనుకోండి... ఆ డబ్బుతో వ్యాపారం పెట్టుకుంటే నాలుగురూపాయలు వస్తుంటాయి. తెచ్చిన అప్పును తిరిగి కట్టడానికి సులభంగా ఉంటుంది. బ్యాంకు వాళ్లు అప్పిచ్చారు కదా అని డబుల్ బెడ్‌రూం ఫ్లాట్ కొనుక్కుని ఎ.సి పెట్టుకుని పడుకుంటే, తిరిగి బ్యాంకు వాళ్లకు అప్పు కట్టడానికి ఆ ఫ్లాట్‌తో పాటు ఇంకేవన్నా ఆస్తులున్నా అమ్ముకోవాల్సి వస్తుంది. ఇప్పుడు నెల్లూరుకు హడ్కో ఋణం పరిస్థితి కూడా అలాగే తయారైంది. కరువు కాలంలో నెల్లూరుకు 1,090కోట్ల రూపాయలు మంజూరైనందుకు ఆనందించాలో, లేక వీటిని వడ్డీతో సహా తిరిగి కట్టాల్సినందుకు బాధపడాలో అర్ధం కావడం లేదు.**

హడ్కో నిధులు 1090కోట్లు వస్తాయి. భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాలకు వీటినే ఖర్చు చేస్తారు. ఇంతవరకు బాగానే వుంది. భూగర్భ డ్రైనేజీ పేరుతో రోడ్లు పగలగొడతారు. చాలా రోజులు ట్రాఫిక్ అవస్థలు తప్పవు. తెచ్చిన 1090కోట్ల నిధులను సులభంగా ఖర్చు చేస్తారు. కాంట్రాక్టర్లకు నాలుగు రూపాయలు మిగులుతాయి. కాని ఈ నిధులకు తగ్గ పని కంటికి కనిపించదు. సరే, ఇదంతా పక్కనపెడితే ఇది ఉచితంగా ఇచ్చే నిధులు కావు. వందకు రూపాయి పదిపైసలు వడ్డీతో తిరిగి కట్టాలి. 14ఏళ్లలోపు మొత్తం అప్పును కట్టాల్సి వుంది. అసలే నెల్లూరు నగరపాలక సంస్థ పరిస్థితి అంతంతమాత్రంగా వుంది. ఆదాయం కోసం ప్రజలను పన్నుల రూపంలో బాదడం తప్పించి ఆదాయం పెంచుకోవడానికి మరో మార్గం లేదు. ఈమధ్యనే పన్నులు పెంచారు. అవి కట్టడానికే నెల్లూరు జనం నానా అగచాట్లు పడుతున్నారు. 1090కోట్ల హడ్కో నిధులను వెంకయ్యనాయుడో, నారాయణో, అజీజో ఆస్తులు అమ్మి కట్టరు. ఎందుకంటే అవి వాళ్ల ఇంటికి తెచ్చుకున్న నిధులు కాదు. నెల్లూరు నగరాభివృద్ధి కోసం తెచ్చే నిధులు. కాబట్టి తిరిగి చెల్లించాల్సిన భారం కూడా నెల్లూరు ప్రజలపైనే పడే అవకాశం వుంది. హడ్కో నిధులు వచ్చాయని చంకలు గుద్దుకోవాల్సిన పనిలేదు. తిరిగి చెల్లించడానికి కార్పొరేషన్ వాళ్లు టెండర్ పెట్టేది జనం జేబులకే!

## నెల్లూరు వైద్య కళాశాలలో ఎంసిఐ తనిఖీలు

నెల్లూరులోని ఏ.సి.సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాలలో సోమవారం భారత వైద్యమండలి సభ్యులు తనిఖీలు నిర్వహించారు. ఈ కళాశాలలో 150సీట్లతో కూడిన రెండో బ్యాచ్‌కు అనుమతి ఇచ్చేందుకు పూర్తి సదుపాయాలు ఉన్నాయా లేవా అని ఈ కమిటీ సభ్యులు డాక్టర్ చిత్తరంజన్‌రాయ్, డాక్టర్ జి.శివజ్ఞానం, డాక్టర్ అభిమన్యుబసులు పరిశీలించారు. ముఖ్యంగా గతంలో తనిఖీకి వచ్చినప్పుడు గుర్తించిన లోపాలను సరిచేసారా లేదా అనేదానిపై దృష్టిపెట్టారు. ఈసారి తనిఖీలోనూ కళాశాలలో నెలకొన్న పలు లోపాలు వీరి దృష్టికి వచ్చాయి. అసోసియేట్ ప్రొఫెసర్లు లేకపోవడం, పరిశోధనా పత్రాలు లేకపోవడం, పలుమార్లు వైద్యులను బయటనుండి పిలిపించుకోవడాన్ని గుర్తించారు. ఎంసిఐ తనిఖీల నేపథ్యంలో అధికారులు ముందుగానే ఇక్కడ అదనపు వైద్యులను, నర్సింగ్ సిబ్బందిని ఏర్పాటు చేసి మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేసారు.

## • మట్టిలో మమేకమైన మస్తాన్‌బాబు





# కొండల్లో ఎదిగి... నేలతల్లి గుండెల్లో ఒదిగి...

**మృత్యువును చూసి చాలామంది భయపడుతుంటారు. మృత్యువును తలచుకుని ఆందోళన చెందుతుంటారు. మృత్యువును ప్రతిఒక్కరూ శత్రువుగా చూస్తుంటారు. కాని ఒక్కోసారి మానవ ప్రపంచం చేయలేని మంచి పని మృత్యువు చేస్తుంటుంది. ఈ సమాజం గుర్తించని మహోన్నత వ్యక్తులను మృత్యువే గుర్తించేలా చేస్తుంది. ఆ మృత్యువు మన ఆలోచనలలోనే లేని ఓ మహోన్నత వ్యక్తి చరిత్రను మన కళ్ల ముందు ఆవిష్కరించింది.**

మల్లి మస్తాన్‌బాబు... 2015మార్చి 24 ముందు దాకా ఇతని గురించి ఎవరికీ తెలియదు. ఎవరికో ఎందుకు అతను పుట్టి పెరిగిన సంగం మండలంలోనే చాలా మందికి తెలియదు. సామాన్య ప్రజల దాకా ఎందుకు... అనుక్షణం ప్రజలను తట్టిలేపుతూ, చీమ చిటుక్కుమన్నా బ్రేకింగ్ న్యూస్, షాకింగ్ న్యూస్‌లలో ఇష్టా క్రీడలలో రికార్డులతో పాటు రికార్డు స్థాయిలో కోట్లు గడించిన క్రీడాకారులకు పెద్దపీట వేసే మీడియాకు సైతం 2015 మార్చి 24 ముందు దాకా కూడా ఇతని గురించి పెద్దగా తెలియదు. ధ్యాన్‌చంద్ దేశం కోసం హాకీ ఆడాడు. సచిన్ టెండూల్కర్ ఈ దేశం కోసం క్రికెట్ ఆడాడు. ప్రపంచంలోనే భారత క్రికెట్‌కు పేరు ప్రతిష్టలు తెచ్చాడు. సానియా మీర్జా టెన్నిస్‌లో, సైనా నెహ్వాల్ బ్యాడ్మింటన్‌లో నెంబర్‌వన్ ర్యాంకుల్లో నిలిచారు. వీళ్లు దేశం కోసమే ఆడారు, అందులో సందేహం లేదు. క్రీడల వల్ల ఏ దేశానికైనా పేరు ప్రతిష్టలొస్తాయే గాని ఆర్థిక ఆదాయం ఉండదు. దేశం కోసం వీళ్లు ఆడినా, ఆ ఆట మూలంగా వీళ్లు ఆర్థికంగా అంతో ఇంతో లాభపడ్డారు. ఇందులో సందేహం లేదు. అదీ కాక ప్రజల్లో తరగని ఇమేజ్‌తో అభిమానులు బ్రహ్మరథం పట్టారు. ప్రతిరోజూ టీవీలలో, పత్రికల్లో తమ ఫోటోలు, స్టోరీలను చూస్తూ సంతోషకరమైన జీవితాన్ని అనుభవించారు.

కానీ, మల్లి మస్తాన్‌బాబు అనే ఒక సాహసోపేత పర్వతవీరుడికి ఆ అదృష్టం, అవకాశం కలగలేదు. గిరిజన కుటుంబంలో పుట్టినా, పేదరికంలో పెరిగినా ఉన్నతమైన చదువులు చదివాడు. అత్యున్నత స్థాయి ఉద్యోగ అవకాశం ఉన్నా వదులుకున్నాడు. పర్వతారోహణలో ప్రపంచంలో భారత్ పేరు నిలబెట్టాలనుకున్నాడు. భారతదేశం తరపున ప్రపంచంలోని అన్ని ఖండాలలో వున్న ఎత్తైన పర్వతాలను అధిరోహించిన భారతీయుడిగా నిలవాలనుకున్నాడు. ఇందుకోసం అతను ప్రభుత్వం నుండి పైసా ఆశించలేదు. కార్పొరేట్ కంపెనీల స్పాన్సర్‌షిప్ కోసం పాకులాడలేదు. స్నేహితులే అతనికి కొండంత అండగా నిలిచారు. స్నేహితులు, కుటుంబసభ్యుల సహకారంతోనే అతను ఏడు ఖండాలలోని ఎత్తైన పర్వతాలను 172రోజుల్లో అధిరోహించి గిన్నీస్ రికార్డు కెక్కాడు. భారత పతాకను ఏడు ఖండాల్లో ఎగురవేశాడు.

మస్తాన్‌బాబు చేసిన సాహసానికి, సాధించిన విజయానికి అమెరికాలోనో, జర్మనీలోనో, ఇంకో దేశంలోనో అయితే బ్రహ్మరథం పట్టేవాళ్లు. అతని పేరు మోతెక్కిపోయేది. కాని భారత దేశంలో లక్షల కోట్లు కుంభకోణాలకు పాల్పడ్డ మంత్రులకు, సెంచరీలు కొట్టే క్రికెట్ స్టార్‌లకు, ఒంటి చేత్తో వందమందిని కొట్టే సినిమాస్టార్‌లకు వచ్చినంత క్రేజ్ ఇంకెవరికీ రాదు. ఈ సమాజంలో ఆ సంస్కృతి ఉండబట్టే మస్తాన్‌బాబు సాధించిన విజయాన్ని భారతదేశం కాదు కదా, మస్తాన్‌బాబు సొంతూరోళ్లు కూడా గుర్తించలేకపోయారు. పర్వతారోహణలో అతను ఇంకా ఎన్నో విజయాలు సాధించివున్నా దానిని గుర్తించే అవకాశమే లేదు. ఎందుకంటే పర్వతారోహణ అంటే మనవాళ్లు సంగం కొండ ఎక్కినంత సులభంగా ఫీలవుతుంటారు.

కేవలం మస్తాన్‌బాబు మరణంతోనే అతని ప్రతిభను ఈ లోకం గుర్తించింది. ఇది మన దౌర్భాగ్యమే! సచిన్, సానియా మీర్జాలకు ఇచ్చిన గుర్తింపులో కనీసం నూరోవంతు గుర్తింపన్నా అతను సజీవంగా వున్నప్పుడు లభించివుంటే, అతని సాహసాలకు, చేసిన కష్టానికి కొంత సంతృప్తి లభించి ఉండేదేమో!

సమాజం గుర్తించని మస్తాన్‌బాబు ఖ్యాతిని కేవలం మృత్యువు వెలుగులోకి తీసుకురాగలిగింది. మస్తాన్‌బాబు మృత్యు ఒడిలోకి చేరాకే, అతని గురించి ఈ లోకం తెలుసుకుంది. భారతదేశ ప్రతిష్టను నిలబెట్టడం కోసం అతను చేసిన సాహసాలను చూసి ప్రతిఒక్కరూ చలించిపోయారు.

చిలీలోని ఆండీస్ పర్వతారోహణలో మస్తాన్‌బాబు చనిపోయారు. మార్చి 24న అతను చనిపోతే సరిగ్గా నెలరోజులకు ఏప్రిల్ 24వ తేదీ ఆయన మృతదేహం స్వగ్రామం సంగం మండలంలోని గాంధీ గిరిజన సంఘంకు చేరుకుంది. పేరు మోసిన ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల్లో ప్రముఖులు చనిపోతే పెద్ద సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. కానీ, వచ్చిన వారితో చనిపోయినవారికి ప్రత్యక్ష లేదా పరోక్ష సంబంధాలుంటాయి. అయితే, మల్లి మస్తాన్‌బాబు కడచూపు కోసం గాంధీ గిరిజన సంఘంకు వేలాదిమంది వచ్చారు. 24, 25తేదీలలో అయితే ఈ ఊరు జన సముద్రాన్ని తలపించింది. వచ్చినవాళ్లలో రైతులున్నారు, వృద్ధులు, పిల్లలు, విద్యార్థులు, మహిళలు, క్రీడాకారులు... అన్ని వర్గాల వాళ్లున్నారు. మస్తాన్‌బాబుకు వీళ్లు తెలియదు, వీళ్లకు మస్తాన్‌బాబు తెలియదు. కానీ, ఈ నెలరోజుల్లోనే అతని గురించి తెలుసుకున్నారు. అతని గొప్పతనాన్ని గుర్తించారు. దేశం కోసం అతను చేసిన సాహసాలు వీరి మనసులను కదిలించాయి. అందుకే కడసారి మస్తాన్‌బాబు మృతదేహాన్ని సందర్శించి కన్నీటి నివాళు లర్పించారు.

మస్తాన్‌బాబు దేశం కోసం చేసిన త్యాగాలకు అతను కోట్లు సంపాదించలేదు కానీ, తన కోసం కన్నీళ్లు రాల్చిన కోట్ల మంది అభిమానులను సంపాదించుకున్నాడు. ఆ కన్నీళ్లు రాలుతుండగానే మస్తాన్‌బాబు ప్రభుత్వ లాంఛనాల మధ్య ఈ నెల 25న ఏ మట్టి మీదయితే అడుగులు వేయడం నేర్చుకున్నాడో, ఆ మట్టిలోనే మమేకమయ్యాడు.

# టిటిడి ఛైర్మెన్‌గా నెల్లూరీయుడు



తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి ఛైర్మెన్‌గా నెల్లూరీయుడైన చదలవాడ కృష్ణమూర్తిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. చదలవాడ కృష్ణమూర్తిది నెల్లూరు జిల్లా నాయుడుపేట. వ్యాపారం గాని, రాజకీయం గాని నాయుడుపేట నుండే మొదలు పెట్టాడు. నాయుడుపేట, గూడూరులతో వ్యాపార సంబంధాలున్నాయి. గతంలో నాయుడుపేట మండలాధ్యక్షుడుగా కూడా పని చేశాడు. తన వ్యాపారాన్ని తిరుపతికి విస్తరించాడు. తిరుపతిలో విద్యాసంస్థలను నెలకొల్పాడు. 2004లో తిరుపతి ఎమ్మెల్యేగా గెలిచాడు. 2014ఎన్నికల్లో తిరుపతి అసెంబ్లీ నుండి టిడిపి టిక్కెట్‌ను ఆశించాడు. చంద్రబాబు సీటివ్వకుండా పార్టీ అధికారంలోకి వస్తే టిటిడి ఛైర్మెన్ పదవిని ఇస్తానని హామీ ఇచ్చాడు. చంద్రబాబు ఆ హామీని ఎట్టకేలకు ఇప్పుడు నిలబెట్టుకున్నాడు.

# పంట కాలువలను కాపాడుకుందాం..

**--- ఎమ్మెల్యే కోటంరెడ్డి ---**



నెల్లూరు రూరల్ నియోజక వర్గంలోని పలుప్రాంతాల్లోని పంటకాలువలను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి గత నెల 28న ఇరిగేషన్ అధికారులు రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి మాట్లాడుతు పలుప్రాంతాల్లో పంట కాలువలు అధ్వానంగా ఉన్నాయని,వాటిని ఆదునికరించాల్సిన అవసరం ఉందన్నారు. నెల్లూరు చెరువు నుంచి విడుదలయ్యే నీరు కంబాల తూము నుంచి ఉయ్యాల కాలవ, ఊటు కాలువల గుండా ప్రవహించే అవకాశం ఉండేదన్నారు.కంబాల తూము వద్ద ఉన్న షట్టర్లు పాడైపోయి పదేళ్ళు గడుస్తున్నా నేటికి వాటిని పట్టించుకోలేదన్నారు. సాగునీరు సక్రమంగా ప్రవహించక వందలాది ఎకరాల పంటలు ఎండిపోయిన పరిస్థితి ఉందన్నారు. దీంతో రైతులు నష్టపోయారని,పాడైపోయిన చెక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో వైఎసార్ సిపి రూరల్ మండల కన్వీనర్ వేమిరెడ్డి హరిశివారెడ్డి, బండి శ్రీకాంత్‌రెడ్డి అచ్యుతరెడ్డి, వెంకటరమణారెడ్డి, పాపిరెడ్డి, ఇరిగేషన్ ఏఇ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబు పాలన అవినీతిమయం

**---------------------- నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ---**



చంద్రబాబు పాలన అవినీతిమయంగా వుందని మరోసారి రుజువు చేసారని వైయస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరు మాగుంటనగర్‌లోని వైయస్సార్సీపీ కార్యాలయంలో గత నెల 26వ తేదీ విలేకర్లతో ప్రసన్నకుమార్‌రెడ్డితో పాటు సర్వేపల్లి, గూడూరు ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పాశం సునీల్‌కుమార్‌లు ప్రభుత్వ తీరును ఎండగట్టారు. ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సభ జరిగితే స్థానికంగా వుండే ఎమ్మెల్యే సునీల్‌కుమార్‌కు కనీస గౌరవమర్యాదులు ఇవ్వకుండా ఉండడం అన్యాయమన్నారు. ప్రజలచేత ఎన్నుకోబడిన దళిత ఎమ్మెల్యేని సిఎం సభలో అవమానించడం బాధా కరమన్నారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి దాదాపు 10నెలలు కావస్తున్నా హడావుడి పర్యటనలు తప్ప పేదలకు ఉపయోగపడే పనులు, అభివృద్ధి శూన్యంగా ఉన్నాయని విమర్శించారు. పాశం సునీల్‌కుమార్ మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో జరిగిన సభలో దళిత ఎమ్మెల్యే అయిన తనకు అవమానం జరిగిందన్నారు. తన నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తుంటే స్థానిక ఎమ్మెల్యేనైన తనను మాట్లాడనీయకుండా అవమానించడం బాధాకరమన్నారు. ఈ విషయంపై శాసనసభ స్పీకర్, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానన్నారు.

ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్ రూప్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లో విశ్వసాయి విజయకేతనం

అనతికాలంలోనే విద్యారంగంలో అనూహ్యంగా ఎదిగిన విశ్వసాయి జూనియర్ కళాశాల ఈ యేడాది ఇంటర్ ఫలితాల్లోనూ అద్భుతఫలితాలను సాధించింది. కళాశాలల ఛైర్మెన్ సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్‌ల సారథ్యంలో కళాశాల విద్యార్థులు మెరుగైన మార్కులతో రాష్ట్రంలోనే తమ కళాశాలకు ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చారు. ఈ యేడాది సీనియర్ ఇంటర్ ఫలితాలలో విశ్వసాయి విజయ దుందుభి మ్రోగించింది. యం.పి.సి., మరియు బై.పి.సి విభాగాలలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించటమే కాక జిల్లాస్థాయిలో అగ్రగామిగా విశ్వసాయి నిలిచింది.

యం.పి.సి విభాగంలో 1000మార్కులకు గాను 988మార్కులు సాధించి జి.కావ్యశ్రీ ప్రథమ స్థానంలో, 987 మార్కులు సాధించి పి.హరిచందన ద్వితీయ స్థానంలో, 981 మార్కులు సాధించి కె.అశ్రిత మరియు పి.వెంకట బిందు భార్గవి తృతీయ స్థానంలో నిలిచారు. పరీక్షకు హాజరైన పరిమిత విద్యార్థులలో 60 మంది 900 మార్కులు పైబడి సాదించారు. బై.పి.సి విభాగంలో 1000 మార్కు లకు గాను 987 మార్కులు సాధించి దువ్వూరు హర్షితారెడ్డి ప్రథమ స్థానంలోను, 986 మార్కులు కె.యశ్వంత్ ద్వితీయ స్థానంలోను, 985 మార్కులు సాధించి పి.మేఘనారెడ్డి తృతీయ స్థానంలో నిలిచారు. బై.పి.సి విభాగంలో 970 మార్కులకు పైబడి 60శాతం మంది విద్యార్థులు, 900 మార్కులు పైబడి 90 శాతం మంది విద్యార్థులు 'ఏ' గ్రేడు సాధించారు.



ఈ సందర్భంగా నెల్లూరు మాగుంట లే అవుట్ విశ్వసాయి కాలేజ్ నందు అభినందన సభ ఏర్పాటు చేసారు. ఛైర్మెన్ డా॥ యన్.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీసి సరియైన ప్రణాళికతో భోధన చేసినందు వల్ల, విద్యార్థుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్ల, ఈ అద్భుత విజయం సాధించగలిగామని చెబుతూ విద్యార్థులను అభినందించారు.

డైరెక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ కాలేజి అనుసరించిన ఫైవ్ స్టెప్ ప్రోగ్రామ్, స్ట్రెస్ ఫ్రీ ఎడ్యుకేషన్, టెక్స్టుబుక్ రీడింగ్ మరియు నిరంతర పర్యవేక్షణ వల్ల ఈ విజయం తమ సొంతమైందని విద్యార్థులను అభినందించారు.

ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లి దండ్రులు, అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## జెఇఇ మెయిన్స్‌లోనూ విశ్వసాయి హవా

దేశవ్యాప్తంగా ఎన్ఐటిలు, ఇతర సంస్థల్లో ఇంజినీరింగ్‌లో ప్రవేశాల కోసం, ఐఐటి అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అర్హత కోసం నిర్వహించిన జాయింట్ ఇంజనీరింగ్ ఎంట్రన్స్(జెఇఇ) మెయిన్స్ ఫలితాల్లో విశ్వసాయి విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సంస్థ ఛైర్మెన్ డా॥ ఎన్.సత్యనారాయణ, డైరెక్టర్ కృష్ణమోహన్‌లు తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరు మాగుంట లే అవుట్ విశ్వసాయి కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఛైర్మెన్ మాట్లాడుతూ ఈ నెల 4న జరిగిన పరీక్షకు దేశవ్యాప్తంగా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో సుమారు 13లక్షల మంది విద్యార్థులు హాజరవ్వగా తమ కళాశాల నుండి హాజరైన పరిమిత విద్యార్థుల్లో జి.కావ్యశ్రీసాయి, పి.హరిచందన, పి.వి.బిందుభార్గవి, కె.ఆశ్రిత, ఎల్.శరన్‌రోహిత్, ఎమ్.అర్పిత, యు.నరసింహ, బి.నివేదిత, ఎన్.సాయిహారిక కామాక్షి అర్హత సాధించారని తెలిపారు. అభినందన సభలో తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర బృందం పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## స్నేహానికి నిలువెత్తు చిరునామా నాన్సీ



ఈ దేశం కాదు, ఇక్కడి భాషరాదు, ఇక్కడ సంస్కృతి తెలియదు... కాని స్నేహబంధం ముందు ఇవేమీ అడ్డంకి కాలేదు. స్నేహబంధం ఆమెను దేశం కాని దేశం వచ్చేలా చేసింది. ఎటువంటి సౌకర్యాలు లేని ఓ కుగ్రామంలో దాదాపు నెలరోజులు గడిపేలా చేసింది. స్నేహం విలువను చాటిన ఆ మంచివ్యక్తి పేరే నాన్సీ! ఆరు పదులు నిండిన ఈ విదేశీ మహిళ నాలుగు పదులు నిండిన మల్లి మస్తాన్‌బాబును పర్వతారోహణలో గురువుగా భావించింది. మార్చి 24వ తేదీన చిలీలోని ఆండీస్ పర్వతాలలో మస్తాన్‌బాబు మరణించాడన్న వార్త తెలిసి ఇండియాకు వచ్చింది. మస్తాన్‌బాబు స్వగ్రామమైన సంగం మండలంలోని గాంధీగిరిజన సంఘంకు చేరుకుంది. దాదాపు 20రోజులకు పైగా ఆ గ్రామంలోనే గడిపింది. మస్తాన్‌బాబు కుటుంబసభ్యులను ఓదారుస్తూ, గురువును కోల్పోయిన బాధలో కూడా తనను తాను ఓదార్చుకుంటూ మస్తాన్‌బాబు కడచూపు కోసం ఎంతగానో ఎదురుచూసింది. తన గురువుకు కన్నీటి నివాళులర్పించి ఇక్కడ నుండి పయనమైంది. స్నేహమా... వర్ధిల్లు!

## విద్యారంగంలో మార్పులకు

# నెల్లూరు నుండే శ్రీకారం

విద్యారంగంలో చేపట్టబోయే మార్పులకు నెల్లూరు జిల్లా నుంచే శ్రీకారం చుట్టినట్లయిందని విద్యాశాఖమంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. నెల్లూరులోని విజయమహల్‌గేట్ సమీపంలో నూతనంగా నిర్మించిన నెల్లూరు డిస్ట్రిక్ట్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(నెపస్మా) కార్యాలయాన్ని మంత్రి గంటా ప్రారంభించారు. ఈ సందర్భంగా యమ్.సి.యస్. కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంలో మార్పులు చేపట్టనుందని, దీనికి ఈ సదస్సు నుండే శ్రీకారం చుట్టినట్లయిందని, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఒక కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం ద్వారా కరస్పాండెంట్స్ కార్యాలయాల చుట్టూ తిరిగి సమయాన్ని వృధా చేసుకోకుండా కార్యాలయం ద్వారా తమ పనులను చక్క బెట్టుకోవచ్చున్నారు. సభాధ్యక్షుడిగా వ్యవహరించిన బి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ కరస్పాండెంట్లు సమస్యలపై చర్చించుకోవాలంటే ఇబ్బందులు ఉండేవని వాటిని ఎదుర్కొనేందుకు తాము ఈ కార్యాలయాన్ని నిర్మించినట్లు చెప్పారు.



ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు బీద రవిచంద్ర, నారాయణ సంస్థల సిఇఓ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఆర్‌జెడి పార్వతి, డిఇఓ ఆంజనేయులు, ఆపస్మా గౌరవాధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సుబ్బారెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

## 'ప్రభా'తం

ఎక్కడ చూసినా మొండిగోడలు..కూలిపోయిన భవనాలు..నేలమట్టమైన ఇళ్ళు.. కుప్పకూలిన ఆ భవనాల కింద హాహాకారాలు చేస్తూ నలిగిపోయి.. చితికిపోయిన మానవ దేహాలు.. మరోవైపు వేలాదిమంది బాధితుల ఆర్తనాదాలు.. మిన్నంటిన రోదనలతో నేపాల్ విలవిలలాడిపోతోంది. హఠాత్తుగా, మృత్యురాకాసిలా మహోగ్రరూపంతో విరుచుకుపడిన పెను భూకంపం ధాటికి, ఎంతో సుందరమైన ఆ దేశంలో ఇప్పుడు స్మశాన వాతావరణం అలుముకుంది. ఎటువైపు చూసినా అత్యంత దయనీయ దృశ్యాలే. కంటికిమింటికి ఏకధాటిగా రోదిస్తున్న కుటుంబాలే. పెనురాకాసిలా ముంచుకొచ్చిన భూకంపం ధాటికి కన్నుమూసి తెరిచేలోగా నేపాల్ కకావికలమైంది.. గుండె చెదిరింది.. గూడు తునాతునకలైంది. మంచు పర్వతాల్లో చల్లగా.. ఆనందంగా బతుకుతున్న నేపాల ప్రజల జీవితాల్లో మాయదారి భూకంపం ఆరని చిచ్చు పెట్టింది. ఎన్నటికీ తీరని శోకార్తిని మిగిల్చింది. శిథిల భవనాల కింద బయటపడుతున్న మృతదేహాల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతూనే వుంది. మృతుల సంఖ్య రానురాను బాగా పెరగ వచ్చని కూడా భావిస్తున్నారు. కనీవినీ ఎరుగుని ఈ మహావిషాదానికి నేపాల్ తల్లడిల్లిపోతోంది. ఈ ఘోరకలితో ఆ పర్వత ప్రాంతమంతా శోకసాగరంగా మారిపోయింది.

ప్రపంచంలోనే ఎత్తయిన హిమాలయ పర్వత శ్రేణుల మధ్య.. అత్యంత సుందరమైన ప్రకృతి రమణీయ సోయగాలతో, ఎల్లవేళలా సుప్రశాంతమైన ఆధ్యాత్మిక వాతావరణంతో పులకించి పరవశించి పోయే నేపాల్.. భూకంప తాకిడికి ఒక్కసారిగా కకావికలమైంది. ఈ నెల 25వ తేది ఉదయం సరిగ్గా 11.56 గంటలకు ముంచుకొచ్చిన భూకంపం ధాటికి పెద్దపెద్ద భవనాలు సైతం పేకమేడల్లా కుప్ప కూలిపోయాయి. వేలాది ఇళ్ళు నేలమట్టమయ్యాయి. రహదారులన్నీ ఛిన్నాభిన్నమైపోయాయి. వేలాది మంది దుర్మరణం పాలయ్యారు. రెక్టార్ స్కేల్‌పై భూకంపం తీవ్రత 7.9గా నమోదైంది. దాదాపు 90 సెకన్లపాటు భూమి కంపించడంతో మంచుకొండల్లో వున్న నేపాల్ అతలాకుతలమైంది. రెండు నిమిషాల్లోనే జరగరాని ఘోరమంతా జరిగిపోయింది. భూకంపప్రభావిత ప్రాంతాల్లో వందలాదిగా ప్రజలు ఎక్కడివారక్కడ విగతజీవులు కావడమో, తీవ్రంగా గాయాల పాలుకావడమో జరిగాయి. తేరుకునేలోగానే నేపాల్ అంతటా మృత్యువిలయమా అన్నట్లు మహావిషాదం ఆవరించింది. తొలివిడతగా వచ్చిన సమాచారంలోనే సుమారు 1457 మంది దాకా మృతి చెంది వుండవచ్చని నేపాల్ ప్రభుత్వం ప్రకటించినా, రోజురోజుకీ ఆ సంఖ్య ఎంతో ఆందోళనకు గురిచేస్తూ మరింతగా పెరుగుతూనే వుంది. శిథిలాలన్నీ తొలగిస్తే ఆ సంఖ్య సుమారు 10వేలకు చేరుకోవచ్చని కూడా భావిస్తున్నారు. శిథిలాల కింద వెతికేకొద్దీ శవాలే. నేపాల్ రాజధాని ఖాట్మండ్‌కు సమీపంలో 80 కిలోమీటర్ల దూరంలో వున్న లామ్‌జంగ్ ప్రాంతంలో అదేరోజు అర్ధరాత్రి నుంచి వేకువఝాము వరకూ 18 సార్లు వరుస భూప్రకంపనల ప్రభావంతో పలు ప్రాంతాలు అతలాకుతలమయ్యాయి. ముఖ్యంగా, నేపాల్‌లోని బార్పాక్ లార్పాక్ అనే ప్రాంతంలో వున్న సుమారు వెయ్యి ఇళ్ళు బాగా ధ్వంసమై నేలమట్టం కావడంతో అక్కడి ప్రజల రోదన హృదయవిదారకంగా వుంది. నేపాల్‌లోని భక్త్‌పూర్, సింధు, లలిత్‌పూర్, ధడింగ్ తదితర ప్రాంతాలతో పాటు అనేక ప్రాంతాల్లో వందలాదిమంది ప్రజలు మృత్యువాత పడడం అందరినీ కలచివేస్తోంది. ఖాట్మండ్ నడిబొడ్డులో వున్న రెండు శతాబ్దాల నాటి అపూర్వమైన, చారిత్రికమైన తొమ్మిది అంతస్తుల ధర్‌హారా టవర్ కుప్పకూలిపోయి ఎంతో ప్రాణనష్టం జరిగింది. ఆ టవర్ శిథిలాల కింద వందలాదిమంది మృతదేహాలను నేపాల్ సైన్యం వెలికి తీసింది. అంతేకాదు, అంతర్జాతీయ పర్యాటక స్థలంగా ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఖాట్మండ్‌లోని దర్బార్ స్క్వేర్ పూర్తిగా ధ్వంసమైపోయి, ఈ పెను భూకంప భీభత్సా నికి సాక్షీభూతంగా నేలమట్టమైపోయింది. నేపాల్ భూకంప తీవ్రతతో మనదేశంలోని బీహార్; ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తదితర ప్రాంతాల్లో కూడా 75 మంది దాకా మరణించారు. నేపాల్ చరిత్రలో గత ఎనిమిది దశాబ్దాలుగా ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా విరుచుకుపడిన ఈ భూకంపం దుర్ఘటనలో అనేకానేక ప్రాచీనమైన చారిత్రిక ప్రసిద్ధి వున్న ఆలయాలు, ప్రసిద్ధమైన పర్యాటక ప్రాంతాలూ, సుందరమైన భవంతులు, అత్యద్భుతమైన కట్టడాలూ అన్నీ కళ్లముందే నిలువునా కుప్పకూలిపోవడంతో నేపాల్ గుండె..పగిలిన అద్దమే అయింది. ఎటుచూసినా మృత్యుభీభత్సం తాలూకు ముక్కలే..విగతజీవుల కుటుంబాలవారి ఆర్తనాదాలే. సుప్రసిద్ధమైన అనేక హిందూ దేవాలయాలకు నెలవుగా వున్న నేపాల్.. ఇప్పుడు కన్నీటికే కొలువుగా.. కన్నీటి కొలనుగా మారింది.

### గుండె చెదిరిన నేపాల్



హిమాలయ పర్వతశ్రేణుల్లో వున్న నేపాల్ చరిత్రలో ఇటీవలి కాలంలో ఎన్నడూ కనీవినీ ఎరుగని విధంగా విరుచుకుపడిన భూకంపం ధాటికి వేలాదిమంది దుర్మరణం పాలయ్యారు. మరెన్నో వేలమంది ప్రజలు గాయాలతో విలవిలల్లాడుతున్నారు. నేపాల్‌లోని అనేకానేక ప్రాచీనమైన చారిత్రిక ప్రసిద్ధి కలిగిన ఆలయాలు, పర్యాటక ప్రాంతాలూ, సుందరమైన భవంతులు, అత్యద్భుతమైన కట్టడాలూ ఒకటేమిటి.. అన్నీ భూకంప విలయానికి పేకమేడల్లా కూలిపోయాయి. గుండెచెదిరి.. గూడు చెదిరి నేపాల్ అంతులేని శోకసాగరంలో మునిగిపోయింది. ఈ మహావిషాదం నుంచి నేపాల్ ఎప్పటికి తేలుకుంటుందో ఏమో!..

అయితే, ఈ ప్రాంతంలో వున్న ప్రపంచప్రసిద్ధ మైన పశుపతినాథ్ ఆలయ పరిసరాల్లో మాత్రం భూకంపం ఛాయలు అంతగా లేకపోవడం ఎంతో విశేషం. అదృష్టం కూడా. ఖాట్మండ్ లోయలో భాగమతి నదికి సమీపంలో 264 హెక్టార్లలో, 518 దేవాలయాలతో అలరారుతోన్న పశుపతినాథ్ ఆలయానికి ఏటా లక్షలాదిమంది యాత్రికులు వస్తూవుంటారు. అంతటి పుణ్యక్షేత్రం.. దివ్యక్షేత్రం కొలువై వున్న ఆ పరిసరాల్లో మాత్రం ఈ భూకంపం ప్రభావం లేకపోవడంతో యాత్రికులంతా ఊపిరిపీల్చుకున్నారు.

ఏదేమైనా, నేపాల్ గుండెకు తగిలిన ఈ భూకంప గాయం మానడం ఎంతో కష్టం. ఈ కష్టకాలంలో నేపాల్‌ను ప్రపంచంలోని అన్ని దేశాలవారు, అన్ని ప్రాంతాల వారూ మానవతా హృదయంతో ఆదుకోవాల్సి వుంది. కనీవినీ ఎరుగనంత ప్రాణ నష్టం, అపారంగా ఆస్తినష్టం జరిగి, రోడ్లు-విద్యుత్-సమాచారం ఇలాంటి అన్ని వ్యవస్థలూ ఘోరంగా దెబ్బతిని, గాఢాంధకారంలో.. అంతులేని దు:ఖసాగరంలో అలమటిస్తున్న నేపాల్.. ఈ మహావిషాదం నుంచి ఎప్పటికి కోలుకుంటుందో మరి!...

# కుక్కలున్నాయి... జాగ్రత్త..

### గుంటూరు సంఘటన ఇక్కడా జరగవచ్చు

***గుంటూరులో ఇటీవల అభంశుభం తెలియని ఆరేళ్ల బాలిక కుక్కల దాడిలో హృదయవిదారకంగా మరణించిన సంగతి తెలిసిందే! ఇటువంటి దారుణాలు నెల్లూరులో కూడా జరిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.***

ఇప్పటికైనా అధికారులు మేల్కొంటే మంచిది. నెల్లూరు నగరంలో ఏ వీధిలో చూసినా కుక్కలు విచ్చలవిడిగా సంచరి స్తున్నాయి. చీకటిపడితే చాలు కొన్ని ప్రాం తాల్లో బయటకు ఒంటరిగా రావడానికే భయమేస్తోంది. వేదాయపాళెం, సంత పేట, పొదలకూరురోడ్డు, వెంగళరావునగర్ తదితర ప్రాంతాల్లో వాహనదారుల్ని కుక్కలు వెంబడిస్తూ తరుముకోవడంతో వాహనదారులు భయభ్రాంతులై ప్రమా దాలకు గురవుతున్న సంఘటనలు లెక్కకు మించి వున్నాయి. రాత్రి పది గంటలు దాటితే చాలు గుంపులు గుంపులుగా ప్రజలపై దాడులకు దిగుతున్నాయి. కుక్కలు, పందుల నివారణకు మునిసిపల్ సిబ్బంది చేపడుతున్న చర్యలు శూన్యం. నెల్లూరులోని 54డివి జన్‌లలో వీధికుక్కలు వేలల్లో వున్నాయి. కొన్ని సందర్భాల్లో కుక్కల్ని పట్టుకుంటున్నా, కొన్ని సంస్థలు అడ్డుతగులుతున్నాయి. వాటి జోలికెళ్లొ ద్దంటూ అధికారులకు నోటీసులు జారీ చేస్తున్నాయి. జంతు సంరక్షణ చట్టాలు కఠినంగా ఉండటంతో అధికారులూ ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. గతంలో ఇంటిలో కుక్కను పెంచుకోవాలంటే మునిసి పాలిటీ ధృవ పత్రం ఇచ్చేది. కాని ప్రస్తుతం అలాంటి నిబంధనలు ఏమీ లేవు. తమకు ఇష్టమైన కుక్కలను పోషించుకోవచ్చు. అవి అనారోగ్యం భారిన పడితే రోడ్లులో వదిలేస్తున్నారు. వీధి కుక్కలతో పాటు ఇవన్నీ గుంపులుగుంపులుగా తయారై మనుషులపైకి దాడులకు దిగుతున్నాయి.

కుక్కలు ఎక్కువగా చిన్నారులపైనే దాడులు చేస్తున్నాయి. ముఖం, ఛాతి, గొంతుపై గాట్లు పెడతాయి. ఆ దాడులు తలదగ్గరైతే విషం మెదడుకు వెంటనే చేరిపోతుంది. దీంతో చాలా ప్రమాదకరమై మరణాలు సంభవిస్తున్నాయి. గుంటూరు సంఘటన నెల్లూరులో జరగకముందే మునిసిపల్ అధికారులు కుక్కలను నియంత్రించేందుకు వెంటనే తగు చర్యలు తీసుకోవాల్సివుంది.



### ఏపికి ప్రత్యేక హోదా కల్పించాలి

**- మాలమహానాడు డిమాండ్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేకహోదాను కల్పించాలని ప్రత్యేక హోదాను సాధించడంలో కేంద్ర మంత్రి వెంకయ్యనాయుడు విఫలమయ్యారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు కొర్రపాటి శరత్‌బాబు ఆధ్వర్యంలో మాలమహానాడు జిల్లాశాఖ తీవ్రంగా నిరసన వ్యక్తం చేసింది. గత నెల 25వ తేదీ నెల్లూరు విఆర్ కళాశాల సెంటర్ వద్ద అంబేద్కర్ విగ్రహం ముందు జిల్లా అధ్యక్షుడు కొప్పోలు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు నల్లజెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు పి.జాన్‌విజయం, కె.వెంకట రమణ, రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్, జిల్లా కార్యదర్శి మోటం వరప్రసాద్ తదిత రులు పాల్గొన్నారు.




### జగన్‌లో మార్పు

వై.యస్.రాజశేఖరరెడ్డి అదృష్టవంతుడు. ఆయన క్రైస్తవుడు అయినప్పటికి ఆ మతాభిమానం పైకి కనిపించేది కాదు. కాబట్టి ఒక వెలుగు వెలిగాడు. మతం వల్లే విశాఖలో విజయమ్మ ఓటమిపాలైంది. జగన్ పడిన కష్టం అంతా ఇంతా కాదు. జైలుకు పోవడం, స్కాముల్లో ఇరుక్కోవడం ఆయనకు మనశ్శాంతి లేకుండా చేసాయి. కఠోర మత పిపాసి వై.యస్.విజయమ్మ. ఆమె జీవితంలో ఎలాంటి విజయం పొందిందో తెలియదు. జగన్‌లో మార్పు వచ్చి ఒంటిమిట్ట, అన్నవరం వెళ్లాడు. మనిషి పెట్టుకున్న మతము సమస్యలను తీర్చలేవు. మనసు మంచిదై, ఆశయం గట్టిదైతే ఏదైనా సాధించవచ్చు.

**- వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

### ఏడాదిలోనే ఏం జరుగుతుంది

నరేంద్ర మోడీ వచ్చి సంవత్సరమవుతుందని, ఏమీ చేయడం లేదని అప్పుడే చాలామంది పెదవి విరుస్తున్నారు. సాక్షాత్తూ దేవుడికే అధికారమిచ్చినా ఏడాదిలో 125కోట్ల జనాభా వున్న భారతదేశంలో ఒక్కసారిగా మార్పురాదు. 60ఏళ్లుగా దేశ ప్రజలను సంక్షేమ పథకాలకు, సబ్సిడీలకు అలవాటు చేసిపెట్టింది కాంగ్రెస్ పార్టీ. ఈ నిర్లక్ష్యాన్నంతా వదిలించాలంటే చాలాకాలమే పడుతుంది. కేంద్రం నుండి ఆశించాల్సింది కుంభకోణాలు లేని నీతివంతమైన పాలనను. మోడీ సారథ్యంలో కొంతవరకు అది సాధ్యమవుతున్నందుకు సంతోషిద్దాం.

**-జి. సురేఖ, కాలిఫోర్నియా.**

### నెల్లూరులో ఉంచాల్సింది

పర్వతారోహకుడు మల్లి మస్తాన్‌బాబు మృతదేహాన్ని కొన్ని గంటలపాటైనా జిల్లా కేంద్రమైన నెల్లూరులో ఉంచి ఉండాల్సింది. నగర ప్రజలు, విద్యార్థులు సందర్శించి నివాళులర్పించే అవకాశముండేది. మస్తాన్‌బాబు స్మారక చిహ్నాన్ని నెల్లూరులో ఏర్పాటు చేయడం సముచితంగా ఉంటుంది.

**- సి.జీవన్, నెల్లూరు.**

### బాధితులను ఆదుకోవాలి

నేపాల్ భూకంప బాధితులను ప్రతి ఒక్కరూ మానవతా హృదయంతో ఆదుకోవాలి. సాంస్కృతికంగా మనకు చాలా దగ్గరి దేశం. భూకంప బాధితులను ఆదుకోవడానికి ప్రధాని నరేంద్ర మోడీ చూపిన చొరవ అభినందనీయం.

**పచ్చిపాల కేశవరెడ్డి, చాగల్లు.**

# నెల్లూరు కబుర్లు

## వెంకయ్యను పికప్ చేసుకున్న చంద్రబాబు

ఇద్దరు స్నేహితులు ఒకే పెళ్లికి వెళ్లాలనుకోండి... చెరోబండిలో పోవడమెందుకు... ఒకే బండిలో పోదాం, నువ్వెళ్లేటప్పుడు ఇంటికొచ్చి నన్ను కూడా పికప్ చేసుకో... అని వారిలో ఒక స్నేహితుడు చెబుతాడు. రెండోవాడు ఇందుకు సరేనంటాడు. ఇది సర్వ సాధారణంగా జరిగేదే! మన ప్రజాప్రతినిధులు కూడా అప్పుడప్పుడు ఈ పద్ధతిని ఫాలో అవుతుంటారు. ఏప్రిల్ 25వ తేదీన వాకాడు మండలం తూపిలిపాలెం వద్ద సునామీ పరిశోధనా కేంద్రం శంకుస్థాపనలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు కూడా పాల్గొనడం తెలిసిందే. చంద్రబాబు ప్రకాశం జిల్లా పర్యటన ముగించుకుని హెలికాప్టర్‌లో నేరుగా తూపిలిపాలెం చేరుకోవాలి. కాని ఆరోజే నెల్లూరులో జరిగిన 'నెల్లూరు నెక్స్ట్' కార్యక్రమంలో వెంకయ్యనాయుడు పాల్గొన్నారు. వెంకయ్యతో పాటు మరో ఇద్దరు కేంద్రమంత్రులు హర్షవర్ధన్, సుజనా చౌదరిలు కూడా నెల్లూరులో ఉండడంతో చంద్రబాబు హెలికాప్టర్‌లో నెల్లూరు పోలీసు గ్రౌండ్‌లో దిగి వాళ్ల ముగ్గురినీ పికప్ చేసుకుని తిరిగి తూపిలిపాలెం పోయాడు.

## ఎస్‌బి డిఎస్పీగా జయరామసుబ్బారెడ్డి

నెల్లూరు స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీగా వై.జయరామసుబ్బారెడ్డిని నియమించారు. ఇక్కడ డిఎస్పీగా వున్న బి.వి.రామారావును ఎక్సైజ్‌శాఖకు బదిలీ చేశారు. కడపజిల్లా వాడైన జయరామసుబ్బారెడ్డికి నెల్లూరుతో ఎడతెగని ఫెవికాల్ బంధముంది. ఎస్‌ఐగా, సిఐగా నెల్లూరు నగరంతో పాటు జిల్లాలో పలు స్టేషన్‌లలో ఎక్కువకాలం పనిచేసాడు. డిఎస్పీగా పదోన్నతి వచ్చాక లూప్‌లైన్‌లో వేసారు. రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక 'రెడ్డి' అనే పేరున్న డిఎస్పీలను పిటిసిలకు, డిటిసిలకు వేశారు. జయరామసుబ్బారెడ్డిని కూడా చిత్తూరు డిటిసికి వేసివున్నారు. ఎట్టకేలకు ఆయనను అక్కడనుండి బదిలీ చేసి నెల్లూరు స్పెషల్ బ్రాంచ్‌కు వేసారు. గతంలో ఆయన ఇదే సీటులో కూర్చుని సిఐగా పనిచేసి వున్నారు.

## ప్రకాశంకు మువ్వా!

నెల్లూరుజిల్లాలో విద్యాశాఖను నానా ఛండాలం చేసి డిఇఓగా సస్పెండైన మువ్వా రామలింగంను ప్రభుత్వం ప్రకాశం జిల్లా విద్యాశాఖాధికారిగా నియమించింది. ఏడాది క్రితం గవర్నర్ ఆయనను పలువివాదాల నేపథ్యంలో సస్పెండ్ చేశారు. ఇప్పుడు సస్పెండ్ ఎత్తేసి ప్రకాశం జిల్లాకు పంపిస్తున్నారు. అక్కడ ఎవర్ని ఎంతగా ఇబ్బంది పెడతాడో!

### చేతి బంతి అసోసియేషన్

## ఛైర్మెన్‌గా వెంకయ్య ఓఎస్‌డి సత్య




శ్రీరాముడికి ఆంజనేయుడిలాగా కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి యం.వెంకయ్యనాయుడుకు నమ్మినబంటు అతని ఓఎస్‌డి వై.సత్యకుమార్. చాలా ఏళ్లుగా వెంకయ్యను నీడలా అంటిపెట్టుకున్నది, ఆయన మంచిచెడ్డలు చూసేది సత్యనే. దేశంలో వెంకయ్యనాయుడు తెలిసిన వారందరికీ సత్య తెలిసుంటాడు. అలాంటి సత్యకుమార్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హ్యాండ్‌బాల్(చేతిబంతి) అసోసియేషన్ ఛైర్మెన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏప్రిల్ 25వ తేదీ నెల్లూరులో జరిగిన హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా సత్యను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోట మనోహర్, కార్యదర్శి ఎన్.వెంకటేశ్వరరావు, శాప్ డైరెక్టర్ రవీంద్రబాబులు అభినందించారు.

## జాతీయ స్థాయికి స్పెల్‌బి ప్రతిభా'రత్నాలు'



'స్పెల్‌బి ఇంటర్‌నేషనల్' వారు ప్రతి సంవత్సరం నిర్వహించే పోటీ పరీక్షల్లో సరస్వతినగర్ రత్నం ఒలింపియాడ్ బ్యాచ్ నుండి 5మంది విద్యార్థులు ఘనవిజయం సాధించి జాతీయ స్థాయి ప్రతిభా పరీక్షకు 7వ తరగతి విద్యార్థులు వై.శ్రీజరెడ్డి, జి.వి.యస్.చరిత్, 8వ తరగతి విద్యార్థిని కె.శీర్షిక, 9వ తరగతి విద్యార్థులు బి.అనన్య, పి.వి.ఆర్.యస్.యస్.శివకుమార్ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీ పరీక్ష నుండి జాతీయ స్థాయికి ఎంపికైన పై విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు డైరెక్టర్స్ డా॥ కె.కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్ అభినందనలు తెలిపారు. అన్ని రంగాల్లో రాణిస్తున్న తమ విద్యార్థులను చూస్తే గర్వంగా ఉందని తెలియజేశారు. డా॥ కిషోర్స్ రత్నం పాఠశాలల జనరల్ మేనేజర్ శ్రీరామ్మూర్తినాయుడు మాట్లాడుతూ డా॥ కిషోర్స్ రత్నం ఒలింపియాడ్ విద్యార్థులు అన్ని పోటీల్లో పాల్గొంటూ తమ ప్రతిభను రాష్ట్ర మరియు జాతీయస్థాయికి చాటుతున్నారని ఇంగ్లీషు భాషపై ప్రత్యేక శ్రద్ధ చూపడం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మనోజ్‌కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



పితృదేవోభవ
సంఘసేవకులు, ప్రజాసేవకులు
స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారు
నిర్యాణం 4 మే 1992
23వ వర్ధంతి (04.05.15) సందర్భంగా
వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ...
డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి
రాజ్యసభ సభ్యులు, మాజీ కేంద్రమంత్రివర్యులు
కుమారుడు

## పురిటిగడ్డపై...

# నెల్లూరు శిఖరాలు














**అవును...! నెల్లూరోళ్ళు చాలామంది ఒకేసారి తమ పురిటిగడ్డ కొచ్చారు. నెల్లూరునేలపై ఆ ఆలు దిద్దుకుని, అమ్మ కొంగు పట్టుకుని ఆటపాటలు నేర్చుకున్న ఎంతోమంది నెల్లూరు వదిలి నేడు దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా అనేక చోట్ల స్థిరపడిపోయారు. తమతమ రంగాలలో వారి ప్రతిభను చూపిస్తూ శభాష్ అనిపించుకోవడమే కాకుండా నెల్లూరు కీర్తిప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేస్తున్నారు. అలాంటివారంతా ఏప్రియల్ 25వ తేదీ నెల్లూరుకొచ్చారు.**

మన ఊరిని మన మెలా బాగుచేసుకోవాలో మన జిల్లాని మనమెలా అభివృద్ధి చేసుకోవాలో మనమే నిర్ణయించుకుందాం... ఆ దిశగా అడుగులు వేద్దాం, మీరంతా తరలిరండి అని కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు, ఆయన కుమార్తె దీపమ్మ ద్వారా ఇచ్చిన పిలుపుకు స్పందించిన అశేష నెల్లూరు ప్రముఖులు ఏప్రియల్ 25, శనివారం నాడు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌కి విశేషంగా తరలివచ్చారు.

"ముంబై ఫస్ట్" అనే అంశంతో ముంబైలో జరిగిన సదస్సు స్ఫూర్తితో నెల్లూరుజిల్లా మరియు నగరాన్ని ప్రగతిబాటలో నడిపించాలనే ధ్యేయంతో "నెల్లూరు నెక్స్ట్" అనే పేరుతో ఈ సమావేశాన్ని నెల్లూరులో ఏర్పాటు చేశారు. ఇదో అరుదైన సంఘటన, అపురూపమైన సన్నివేశం, ఎవరెవరి రంగాల్లో వారు క్షణం తీరికలేకుండా నిత్యం బిజీగా గడిపే దిగ్గజాలను నెల్లూరుకు రప్పించి వారిని సుమారు 7గంటల సేపు ఒక చోట కూర్చోబెట్టగలగడం ఒక్క వెంకయ్యనాయుడికే సాధ్యమయ్యే విషయం. ఇది ఆయన చేసి చూపించాడు. కన్నతల్లిని జన్మభూమిని మనం మరచిపోకూడదు. అందరం ఓ చోట చేరదాం, మన జన్మభూమిని నభూతో నభవిష్యత్‌లా తీర్చి దిద్దుదాం అని ఆయన ఇచ్చిన పిలుపు అందరినీ కదిలించింది.

ఏప్రియల్ 25, 2015 శనివారం నెల్లూరుజిల్లా చరిత్రలో ఓ మరపురాని మరువలేని సంఘటనగా "నెల్లూరు నెక్స్ట్" కార్యక్రమం నిలిచిపోతుంది. ఉదయం 9 గంటల నుండి 9.30వరకూ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సరిగ్గా 9గంటలా45 నిముషాలకు ప్రముఖ సైంటిస్ట్ సతీష్‌రెడ్డి వ్యాఖ్యానంలో జ్యోతి ప్రకాశనంతో "నెల్లూరు నెక్స్ట్" సదస్సు ప్రారంభమయ్యింది. అక్షర పాఠశాల విద్యార్థినులు ఆలపించిన ప్రార్థన, వందేమాతరం గీతాలు ముగిసిన వెంటనే 'లాయర్' పత్రిక సారధి తుంగా శివప్రభాత్‌రెడ్డి (ప్రభు) స్వాగతోపన్యాసంతో కార్యక్రమం మొదలయ్యింది.

మన ఇల్లు, మన వీధి, మన గ్రామం, మన జిల్లా, మన రాష్ట్రం, మన దేశం... ఇవన్నీ మన జీవితంలో భాగమే అని భావించి నిత్యజీవితంలోని మన సమయాన్ని వీటి కోసం కూడా కేటాయించగలిగిననాడే నిజమైన అంకితభావం కలిగిన భారతీయుడు కాగలడని ప్రభు తన ఉపన్యాసంలో పేర్కొన్నాడు.

శ్రీమతి దీపా వెంకట్ "నెల్లూరు నెక్స్ట్" యొక్క ముఖ్య ఉద్దేశ్యం, నెల్లూరు ఇప్పటివరకు చెందిన అభివృద్ధితో పాటు భవిష్యత్తులో నెల్లూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకోవడానికి వున్న అవకాశాలను వివరిస్తూ చేసిన వీడియో ప్రజంటేషన్ 20నిముషాల పాటు కొనసాగింది. ఈ ప్రజంటేషన్‌లో నెల్లూరు అభివృద్ధికి వున్న అన్ని మార్గాలను ఆమె స్పష్టంగా తెలియజేసింది.

నెల్లూరు నెక్స్ట్ ద్వారా తామేం చేయదలచుకున్నామో వివరిస్తూ వెంకయ్యనాయుడు తమ ప్రారంభోపన్యాసం మొదలుపెట్టి తామెవ్వరినీ విరాళాలు ఇవ్వమనో లేక సొంత డబ్బులు ఖర్చుపెట్టి అభివృద్ధి చేయమనో అడగడానికో ఈ సభ ఏర్పాటు చేయలేదని, నెల్లూరీయులంతా ఒక్క చోట చేరి మన జిల్లాను, మన గ్రామాలని మన నగరాన్ని ఎలా అభివృద్ధి చేసుకోవాలో చర్చించుకుని అందరి సలహాలు సూచనలతో పాటు ప్రతి ఒక్కరినీ జిల్లా అభివృద్ధిలో భాగస్వాముల్ని చేయడమే ముఖ్య ఉద్దేశ్యంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నాడు. ఒక రాజకీయ నాయకుడో లేక రాజకీయ పార్టీయో లేక ఒక ప్రభుత్వ వ్యవస్థో అపార అభివృద్ధిని సాధించ లేదని, అందరూ కలసి సమిష్టిగా పనిచేసి ఎవరికి తోచిన సలహా, సూచన వారిచ్చి జిల్లాని ప్రగతి బాటలో నడిపించడానికి దోహదపడాలని పిలుపునిచ్చారు. నెల్లూరు అభివృద్ధి కోసం మనమంతా కలసి చేసే ప్రయత్నంలో ఇది తొలి మెట్టని అన్నారు. మళ్ళీ మళ్ళీ కలుద్దామని మన జిల్లాని ఆదర్శ జిల్లాగా భారతదేశం గర్వించదగ్గ జిల్లాగా మనమే తయారు చేసుకుందామని, ఇందుకోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి అవసరమైన అన్ని వనరులను సమకూర్చడానికి తాను పోరాడతానని వెంకయ్య హామీ ఇచ్చాడు.

అనంతరం నెల్లూరుజిల్లా చరిత్రపై డోలేంద్రప్రసాద్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చాడు. తరువాత యస్.పి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సుందర నగరంగా నెల్లూరును తీర్చిదిద్దుకునే బాధ్యత నెల్లూరీయులుగా ప్రతి పౌరుడిపైనా వుందని అన్నారు. ఎక్కడపడితే అక్కడ గోడలపై రకరకాల పోస్టర్లను అంటించే సంప్రదాయాన్ని ఆపేయాలని, గోడలన్నీ వికారంగా తయారై నెల్లూరు అందాలని మింగేస్తున్నాయని తన ఆవేదనని వ్యక్తం చేశాడు. నెల్లూరుపై రూపొందించిన పాటను ఈ సందర్భంగా చదివి వినిపించాడు.

నెల్లూరుజిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసుకోవడానికి వున్న వనరులను వ్యాపార అవకాశాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా కలెక్టర్ శ్రీమతి యం.జానకి సభికులకు వివరించారు.

నెల్లూరు నుండి న్యూయార్క్ దాకా తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించి నెల్లూరీయులు గర్వించే స్థాయికి ఎదిగిన "పద్మభూషణ్" బిరుదాంకితులు డా॥ జి.వి.కె.రెడ్డి మాట్లాడుతూ నెల్లూరుజిల్లా అంటే అన్ని వేళలా తాను సిద్ధంగా వుంటానని, తన స్వగ్రామం కొత్తూరు నుండి తన ప్రస్థానం మొదలై నేడు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందగలగడానికి బలమైన పునాది పడింది నెల్లూరులోనేనని అన్నారు. నెల్లూరు అభివృద్ధి కోసం ఎలాంటి చేయూతనైనా అందించి నెల్లూరుని నెక్స్ట్ కాకుండా ది బెస్ట్ చేయడానికి ఫస్ట్ ప్లేస్‌లో నిలపడానికి అందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

డా॥ శ్రీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ మనకు కావలసిన ఏ అభివృద్ధినైనా కలసి సాధించుకోవచ్చని, ఏదైనా ఒక్క రోజులోనో ఒక్క నెలలోనో సాధ్యంకాదని, ఇప్పటినుండి అందరం ఒక్కటిగా కలిసి పనిచేస్తే బంగారు భవిష్యత్తును రేపటితరానికి అందించవచ్చని అన్నారు.



సీనియర్ నాయకుడు, కళాబంధు, సాహితీప్రియుడు, శివారాధకుడు, రాజ్యసభ సభ్యుడు తిక్కవరపు సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నీళ్ళలోనే డైనమిజమ్ వుందన్నారు. నెల్లూరీయులు ఎక్కడున్నా ఫస్ట్ ప్లేస్‌లో వుండాలనుకుంటారని అన్నింటిలో తామే నెంబర్1 కావాలనుకుంటారని ఆ గుణం నెల్లూరు నీళ్ళ నుండే అందరికీ అబ్బిందని అన్నారు. రాజ్యసభ నిధుల నుండి నెల్లూరు నగర అభివృద్ధి కోసం ముందుగా రెండుకోట్ల రూపాయలను తక్షణమే అందజేస్తానని చెప్పారు. నెల్లూరోళ్ళంటేనే డేరింగ్, డాషింగ్ అండ్ డైనమిక్ అని పేరుందని, అందరం కలసి నెల్లూరును అభివృద్ధి చేసుకుని నెల్లూరీయుల సత్తా రుజువుచేయాలని అన్నారు.

పారిశ్రామికవేత్త, చిన్నపిల్లల పార్కు రూపకర్త, టౌన్‌హాల్ పునర్నిర్మాణదాత జె.యస్.రెడ్డి మాట్లాడుతూ నెల్లూరుజిల్లాలో ఎంతోమంది దాతలు గతంలో కోట్లాది రూపాయలు విలువచేసే ఆస్తులను ప్రజల కోసం దారాధత్తం చేశారని, వారి పేరుతో వున్న నిర్మాణాలను, ప్రజోపయోగ ప్రాంగణాలను కొంతమంది స్వార్ధ రాజకీయ నేతలు తమ తండ్రులు, తాతల పేర్లతో మార్చుకుంటున్నారని, ఇలాంటి చర్యలవల్ల భవిష్యత్తులో నెల్లూరులో ఏదైనా గొప్ప కార్యక్రమాలు చేయాలనుకునే వాళ్ళు పునరాలోచనలో పడతారని, దొడ్ల సుబ్బారెడ్డి ఆసుపత్రి పేరును కొందరు మార్చాలని చూస్తున్నారని, అందరం ఒక్కటై ఈ దారుణాన్ని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు.

గ్లోబల్ హాస్పిటల్స్ ఛైర్మెన్ డా॥ కంచర్ల రవీంద్రనాథ్ మాట్లాడుతూ నెల్లూరును పరిపూర్ణ ఆరోగ్యానికి చిరునామాగా మార్చడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. తమ గ్లోబల్ ఆసుపత్రి ద్వారా అత్యాధునిక వైద్యసదుపాయాలను భారతదేశంలో పలు ప్రాంతాల్లో అందిస్తున్నామని, నెల్లూరులో సైతం సామాన్యుడికి అందుబాటులో వుండేలా కార్పొరేట్ వైద్యాన్ని ప్రారంభించడానికి ప్రణాళికలు రూపొందించుకుంటున్నట్లు ప్రకటించాడు.

నెల్లూరు నగరంలో వున్న వనరులు అభివృద్ధి, అవకాశాలూ, తక్షణం నగరాన్ని అందంగా తీర్చి దిద్దుకోవడానికి తీసుకోవలసిన చర్యలతో కూడిన పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఇన్‌ఛార్జ్ మునిసిపల్ కమిషనర్ ఇంతియాజ్ అహ్మద్ తెలిపాడు.

పర్యాటక రంగంలో వున్న అవకాశాలను, కావలసిన అవసరాలను ఇప్పటికే అభివృద్ధి చెందిన ప్రాంతాలను వివరిస్తూ టూరిజం మంత్రిత్వ శాఖకు చెందిన అధికారి శ్రీనివాస్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించాడు.

ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడి తమ అమూల్యమైన సలహాలూ సూచనలూ ఇవ్వాలని ఎంతోమంది ఉత్సాహంతో వచ్చినప్పటికీ సమయం తక్కువ కావడంతో ఎక్కువ మందికి అవకాశం ఇవ్వలేకపోయారు. ఉదయం 9.30గంటల నుండీ మధ్యాహ్నం 2గంటల వరకు కార్యక్రమం జరిగినప్పటికీ సమయం చాలలేదు. తదుపరి జరిగే సమావేశం ఎక్కువసేపు జరిపి ఎక్కువ మందికి అవకాశం కల్పిస్తామని వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా ప్రకటించాడు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి నారాయణ మాట్లాడుతూ దీపావళి రాకెట్‌కి షార్‌లో ప్రయోగించే రాకెట్‌కీ పెద్ద తేడాలేదని, దీపావళి రాకెట్ ఆధారంగా మనవాళ్లు రాకెట్లని తయారుచేసి అంతరిక్షంలోకి పంపిస్తున్నారని, ఈ రాకెట్ ఆ రాకెట్‌కి ఏ విధంగా ఆధారమో అలాగే ప్రతీ పనికీ ఏదో ఒక అంశాన్ని ఆధారంగా చేసుకుని మనమంతా నెల్లూరు ప్రగతి కోసం ముందుకు పోదామని పిలుపునిచ్చాడు.

చివరగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. ముగింపు ఉపన్యాసం చేసిన వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన మాటల్లో నెల్లూరు అభివృద్ధి కోసం ఇంతమంది మేధావులు పెద్దలు ఓ చోట చేరడం ఆనందదాయకమని, ఇప్పటికే తాను తనవంతు సహాయసహకారాలను అందిస్తున్నానని, త్వరలో పేద పిల్లల కోసం విపిఆర్ విద్య పేరుతో కార్పొరేట్ స్థాయి స్కూల్‌ని ప్రారంభిస్తున్నానని ఈ స్కూల్‌లో పేద పిల్లలకు పూర్తిస్థాయి ఉచితవిద్యని అందిస్తానని పేర్కొన్నారు. మే30వ తేదీన జరగనున్న రెండో 'నెల్లూరు నెక్స్ట్' సమావేశంలో రెట్టింపు ఉత్సాహంతో అందరూ పాల్గొనాలని ఆహ్వానించారు.

చారిత్రాత్మకమైన ఈ సదస్సులో అనేకమంది ప్రముఖ నెల్లూరీయులు పాల్గొన్నారు. వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు, ప్రస్తుత మరియు మాజీ ఐఏఎస్, ఐపిఎస్ అధికారులు, డాక్టర్లు, ఇంజనీర్లు, వివిధ సంస్థల మరియు అసోసియేషన్ల ప్రతినిధులు సుమారు 300మందికి పైగా ఈ వేడుకల్లో పాల్గొన్నారు. వేదికతో పాటు చక్కని విందును కూడా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఏర్పాటు చేశాడు.

వెంకయ్యనాయుడితో పాటు కేంద్రమంత్రులు డా॥ మహేష్‌శర్మ, సుజనాచౌదరి, డా॥ హర్షవర్ధన్‌లు పాల్గొనగా నారాయణతో సహా రాష్ట్రమంత్రులు కామినేని శ్రీనివాస్, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి ఈ నెల్లూరునెక్స్ట్ కార్యక్రమానికి అతిథులుగా వచ్చారు.

అద్భుతమైన ఏర్పాట్లతో ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన ఈ వేడుకను ఆసాంతం వెంకయ్యనాయుడి కుమార్తె దీపమ్మ సారధ్యంలో విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీసిటి మేనేజింగ్ డైరెక్టర్ రవిరెడ్డి సన్నారెడ్డి, వెంకయ్యనాయుడు ఓయస్‌డి సత్యకుమార్, 'లాయర్' పత్రిక సారధి శివప్రభాత్‌రెడ్డి పర్యవేక్షించారు. సుప్రసిద్ధ శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి వ్యాఖ్యానంతో పూర్తి కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులందరూ కూడా చివర్లో వేదికపై చేరి గ్రూప్‌ఫోటో దిగి ఈ కార్యక్రమాన్ని చిరస్మరణీయ తీపి జ్ఞాపకంగా తమ మనస్సుల్లో నిలుపుకున్నారు.

చిన్నా పెద్దా తేడా లేకుండా కులమతాలకతీతంగా వర్గాలతో సంబంధం లేకుండా నెల్లూరీయులంతా ఒక్కటై నిలచి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. భవిష్యత్తులో ఇదే ఉత్సాహంతో, ఇదే స్ఫూర్తితో ముందడుగు వేసి నెల్లూరును ఫస్ట్‌గా, ది బెస్ట్‌గా తీర్చిదిద్దుకుందాం అని ప్రతినబూనుదాం.











## సాక్షాత్తూ శ్రీమన్నారాయణ రూపమే..
# శ్రీ వేంకటేశ్వరుడు

**- డా. మేడసాని మోహన్**



తిరుమల కొండల్లో కొలువై వున్న ఆ తిరుమలేశుడు సాక్షాత్తూ ఆ శ్రీమన్నారాయణుని రూపమేననీ, పరబ్రహ్మస్వరూపమైన ఆ భగవంతుడు ఈ కలియుగంలో శ్రీ వేంకటేశ్వరునిగా అర్చారూపంలో స్వయంభువుగా వెలశారని టిటిడి శ్రీనివాస వాఙ్మయ అధ్యయన సంస్థ ప్రత్యేక అధికారి, మహాసహస్రావధాని డా. మేడసాని మోహన్ అన్నారు. గత నెల 26,27 తేదీల్లో నెల్లూరులోని శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవా సమితి ఆధ్వర్యంలో, స్థానిక టిటిడి కల్యాణమండపంలో 'శ్రీవేంకటేశ్వరస్వామి వైభవం'పై ఆయన ఆధ్యాత్మిక ఉపన్యాసాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరుడేనని అన్నారు. శ్రీ వేంకటేశ్వరస్వామి తత్వాన్నీ, మహత్వాన్నీ డా.మేడసాని మోహన్ ఎంతో విపులంగా వివరించారు. రెండవ రోజు ప్రవచనం కార్యక్రమంలో తొలుత మేడసాని మోహన్‌ను గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం ఇ.ఓ బాలసుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు. శ్రీ వేంకటేశ్వర కల్యాణ మహోత్సవ సేవా సమితి నిర్వాహకులైన వాకాటి విజయకుమార్‌రెడ్డి, కొండా బలరామిరెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, ఇ.కె సుబ్రహ్మణ్యంలతో పాటు, టిటిడి ధర్మప్రచార పరిషత్ సమన్వయకర్త మల్లెల శ్రీహరి, వీరిశెట్టి సుధాకర్, బివి నరసింహం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీసిటిలో ఎఫ్ఐఇఓ ప్రతినిధులు



చెన్నైలోని భారత ఎగుమతి సంస్థల సమాఖ్య(ఎఫ్ఐఇఓ) నుండి 35మంది సభ్యుల బృందం గత నెల 24వ తేదీన శ్రీసిటిలో పర్యటించింది. సమాఖ్య డిప్యూటి డైరెక్టర్ జనరల్ కె.ఉన్నికృష్ణన్ ఆధ్వర్యంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటి ఫౌండేషన్ అధ్యక్షులు రమేష్ సుబ్రహ్మణ్యం స్వాగతం పలికారు.

శ్రీసిటి నిర్వాహక నిర్దేశకులు రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఎఫ్ఐఇఓ ప్రతినిధుల బృందం శ్రీసిటిని సందర్శించడం, జరుగుతున్న అభివృద్ధిని ఆసక్తితో గమనించడం అభినందించడం తనకు ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. విభిన్న పరిశ్రమలకు చెందినవారైనందున వారి అనుభవాలు, సలహాలు శ్రీసిటి పురోభివృద్ధికి ఉపకరిస్తాయన్నారు. శ్రీసిటి వంటి పారిశ్రామిక పార్క్‌ను స్థాపించి, వ్యాపారాభివృద్ధికి అవసరమైన అన్ని వసతులను, చక్కని సదుపాయాలను పరిశ్రమలకు కావలసిన విధంగా ఏర్పరచినందుకు శ్రీసిటి యాజమాన్యాన్ని ఉన్నికృష్ణన్ అభినందించారు.



# ముగిసిన ఇస్కాన్ వేసవి శిక్షణ

నెల్లూరు మినీబైపాస్‌రోడ్డు సమీపంలోని ఇస్కాన్‌సిటీలోని శ్రీకృష్ణ అంతర్జాతీయ చైతన్య సంఘం(ఇస్కాన్)లో మూడురోజుల పాటు వివిధ అంశాల్లో చిన్నారులకు నిర్వహించిన వేసవి శిక్షణాశిబిరం గత నెల 27న ముగిసింది. ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరం అధ్యక్షుడు సుఖదేవస్వామి మాట్లాడుతూ వేసవిని పురస్కరించుకుని ఇస్కాన్ మందిరంలో బాలబాలికలకు యోగ, రంగుల అద్దకం, చిత్రలేఖనం, నృత్యం తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. నెల్లూరు నగరానికి చెందిన వివిధ పాఠశాలలకు చెందిన పలువురు చిన్నారులు ఈ శిక్షణా శిబిరంలో పాల్గొన్నారు. వీరిలోని ప్రతిభను గుర్తించి, వారికి ప్రోత్సాహకంగా జ్ఞాపికలు అందజేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి సెలవుల్లో వారికి ఇష్టమైన అంశాల్లో ప్రోత్సహించి వారిని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. సామాజిక బాధ్యతను, దైవం పట్ల భక్తిభావాలను పెంపొందించాలని కోరారు.

# నెల్‌క్యాస్ట్‌లో ఉచిత వైద్యశిబిరం



రక్తదానం చేస్తున్న నెల్‌క్యాస్ట్ స్టాఫ్ భాస్కర్‌రెడ్డి, పక్కన నెల్‌క్యాస్ట్ జిఎంలు, రొటేరియన్లు

గూడూరు నెల్‌క్యాస్ట్ కంపెనీలో ఆదివారం నెల్‌క్యాస్ట్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు రోటరీక్లబ్ గూడూరువెస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మరియు రక్తదాన శిబిరం జరిగింది. షుమారు 100 మంది దాకా నెల్‌క్యాస్ట్ సిబ్బంది రక్తదానం చేశారు. ఈ శిబిరంలో డాక్టర్లు కె.రోహిణీదేవి, కె.ప్రసాద్ రెడ్డి, రాజా, విద్యాసాయికుమారి, శ్రీనివాసులురెడ్డి, వి.అశోక్‌కుమార్ పాల్గొని నెల్‌క్యాస్ట్ సిబ్బందికి వైద్య పరీక్షలు జరిపారు. ఉచితంగా నెల్‌క్యాస్ట్ మేనేజ్‌మెంట్ మందులు అందజేశారు.

ఈ శిబిరంలో నెల్‌క్యాస్ట్ జిఎంలు ఎన్.సుదర్శనరెడ్డి, దువ్వూరు రవీంద్రనాథ్‌రెడ్డి, డి.మునిచంద్రయ్య, పి.కోటిరెడ్డి, సి.బ్రహ్మానందరెడ్డి, సి.హెచ్.శ్రీనివాసరావు, టి.గజపతి, పిఆర్ఓ ఎ.శివకుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఎన్.శ్రీనివాసమూర్తి, రామ్మోహన్‌రావు, వి.శ్రీనివాసులు, దామోదర్‌రెడ్డి, రొటేరియన్లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ఎస్.రామ్మోహన్‌రావు, క్లబ్ కార్యదర్శి కె.రామకృష్ణారెడ్డి, పి.ఎమ్.రావు, నాసిన నాగులు, శేగు శ్రీనివాసులు, కె.సుందర రామిరెడ్డి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# ప్రోటోకాల్‌ను పట్టించుకోలేదు

**- ఎమ్మెల్యే సునీల్‌కుమార్**



విద్యానగర్‌లో నిర్వహించిన ముఖ్యమంత్రి సభలో ప్రోటోకాల్ విషయమై ప్రశ్నిస్తే దాన్ని రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరులోని రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో సోమవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ ప్రోటోకాల్ గురించి మాత్రమే అడిగానని, తెలుగుదేశం పార్టీ నాయకులు గురించి మాట్లాడలేదన్నారు. తాను ఏ పార్టీ ఎమ్మెల్యేనో రాధాజ్యోత్స్నలత తెలీదన్నారని, తాను ఏ పార్టీ ఎమ్మెల్యేనో ప్రజలకు తెలుసన్నారు. ముఖ్యమంత్రి సభావేదికపై ప్రస్తుత, మాజీమంత్రులు, ఎమ్మెల్యేలు ఉంటే... తనను ఏ హోదాలో సభపైకి వచ్చారని ఏకవచనంతో ప్రస్తావించడం సరికాదన్నారు. తన గురించి, తన పార్టీ గురించి మాట్లాడే స్థాయి ఆమెకు లేదన్నారు. సభకు అధ్యక్షత వహించాల్సింది స్థానిక ఎమ్మెల్యేనేనని, కానీ నిబంధనలు ఎవరూ పాటించలేదన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి, మంత్రులను వందసార్లయినా కలుస్తానని, అది తన హక్కని పేర్కొన్నారు. ఇలాగే ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తే పోరాటం చేస్తామన్నారు.

ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు నాశిన నాగులు, రాధాకృష్ణారెడ్డి, ఎంబేటి చంద్రయ్య, ఇజ్రాయెల్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రోటోకాల్ ప్రకారమే నిర్వహించాం

**- టిడిపి ఇన్‌ఛార్జి రాధాజ్యోత్స్నలత**



గూడూరు నియోజకవర్గంలోని విద్యానగర్‌లో కేంద్రప్రభుత్వం ఏర్పాటు చేసిన సిఎం సభను జిల్లా పాలనాధికారిణి జానకి ప్రోటోకాల్ ప్రకారమే నిర్వహించారని గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాధాజ్యోత్స్నలత తెలిపారు. పట్టణంలోని షాదిమంజిల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీమంత్రి బల్లి దుర్గాప్రసాద్‌రావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకాదేవసేనతో కలిసి ఆమె మాట్లాడారు. జ్యోత్స్నలత మాట్లాడుతూ సిఎం సభపై స్థానిక ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ప్రోటోకాల్ పేరిట రాద్ధాంతం చేయడం తగదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు జరిగే సమయంలో తుది నిర్ణయం కలెక్టర్‌దేనని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగానే పాల్గొన్నారని ఇందులో సమాయాభావంతో కేవలం కేంద్రమంత్రులే సభలో ప్రసంగించారని తెలిపారు. రాష్ట్ర ప్రగతికి శంకుస్థాపనల కోసం వచ్చిన సిఎం సభ తీరుపై మాట్లాడడం సరికాదన్నారు.

మాజీమంత్రి బల్లి దుర్గాప్రసాద్‌రావు మాట్లాడుతూ వైకాపా జిల్లా నాయకుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి రాజకీయ భిక్షపెట్టింది చంద్రబాబేనన్న విషయాన్ని మరచి సమావేశాలు పెట్టి ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మెన్ శీలం కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు, పట్టణ తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సమస్య వస్తే అందరూ కలిసి చర్చించుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో రవీందర్, తహాశీల్దార్ నారాయణమ్మ

సమస్య వస్తే అందరూ కలసి చర్చించుకొని సామరస్య ధోరణిలో వెళ్లాలని ఆర్డీవో రవీందర్ అన్నారు. గూడూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో నెల్లటూరులోని విద్యుత్‌శాఖ జిల్లా స్టోర్స్‌లో పనిచేస్తున్న వర్కర్ల మధ్య నెలకొన్న సమస్యపై సోమవారం చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆర్డీవోకు ఇరువర్గాలకు చెందిన వర్కర్లు వారి సమస్యలను వివరించారు. ఆర్డీవో మాట్లాడుతూ అందరూ కలసి పనిచేసుకోవాలని కోరారు. వర్కర్లతో సామాజిక న్యాయం పాటించాలని ఆర్డీవో తెలిపారు. ఒకే దగ్గర పనిచేసేవాళ్లకు సమస్యలు వస్తుంటాయని, ముందు 15రోజులు అందరూ కలసి జిల్లా స్టోర్సులో పనిచేయాలని తెలియజేశారు. ఇదే విషయాన్ని ఏడిఈ శేషారెడ్డి, కాంట్రాక్టర్ రత్నంకు కూడా చెప్పారు. ఓ వర్గం దీనికి అంగీకరించగా మరో వర్గం సూచనప్రాయంగా అంగీకరించింది. ఇదే విషయమై సబ్‌కలెక్టర్ కార్యాలయం సమీపంలో గత 29రోజుల నుంచి నిరాహారదీక్షలు చేస్తున్న ఎస్సీ, ఎస్టీలకు చెందిన హమాలీల వద్దకు ఏడిఇ వెళ్లి నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపజేశారు. ఈ చర్చల్లో స్థానిక తహాశీల్దార్ సి.వెంకటనారాయణమ్మ, గ్రామీణ ఎస్సై హనీఫ్, సిఐటియూ నాయకులు, ఇతర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

బంధువర్గంలో కొద్ది విభేదాలు చోటుచేసుకుంటాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత తక్కువ. ప్రభుత్వ పరంగా పర్మిట్లు, అనుమతులు పొందుతారు. క్రొత్త వ్యాపార ప్రయత్నాలకు, పార్టనర్‌షిప్‌లకు అనుకూల సమయము. వృత్తి వ్యాపారాలలో గుర్తింపు ఆదాయం బాగుంటుంది. అయితే పనులు నిదానంగా జరిగి అనుకూలము కాగలవు. షేర్లపై కొద్ది లాభాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగ వర్గాలు ప్రలోభాలకు పోకండి. పని భారం పెరుగుతుంది. సన్నిహితులు ఆత్మీయులతో చర్చలు జరుపుతారు. ఆర్థికాభివృద్ధికి బాగా కష్టపడినా ఫలితాల పై సంతృప్తి ఉండదు. బిల్లులు పన్నులు చెల్లించడం, అవసరాలకు ఋణం చేయడం జరుగుతుంది. వ్యాపార వర్గాలకు రాబడి సామాన్యం. బిడ్డల విద్యా వ్యాపకాలపై శ్రద్ధ చూపండి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనవసర వ్యవహారాల వల్ల సమస్యలు రావచ్చును. అనుకున్న పనులకు ఆటంకాలు రావడం వల్ల టెన్షన్ పడుతుంటారు. బంధువర్గంతోను సోదర వర్గంతోను ఇబ్బందులు ఏర్పడవచ్చును. కుటుంబ వ్యవహావరాలలో భేదాభిప్రాయాలు రావచ్చును. వ్యాపారవర్గాలకు ఆశించిన ఆదాయముండదు. వృత్తి పరంగా ప్రాబల్యం పెరుగుతుంది. కాని రాబడి ఉండదు.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ప్రముఖులు పెద్దలతో పరిచయాలుంటాయి. స్టాక్ మార్కెట్ లాభాలలో ఉంటుంది. దూర ప్రయాణాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం తగ్గుతుంది. ఖర్చులు పెరిగిపోతాయి. కొన్ని చెల్లింపులు వాయిదా పడటం, రావలసిన బాకీలు వాయిదా పడటం జరుగుతుంది. ఆర్థిక లావాదేవీలందు జాగ్రత్తగా వ్యవహరించండి లేదా వాయిదా వేయడం మంచిది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

**తేది. 01.05.2015 నుండి**
**తేది. 07.05.2015 వరకు**

ఈ వారం మీనంలో కేతువు, మేషంలో రవి కుజులు, వృషభంలో 3తేది నుండి కుజ, వృషభంలో బుధశుక్రులు, 2తేది నుండి మిధునంలో శుక్ర, కర్కాటకంలో గురువు, కన్యలో రాహువు, వృశ్చికంలో శని సంచరిస్తారు. కన్య తుల వృశ్చిక రాశులలో చంద్ర సంచారము

### పంచాంగము:

3తేది ఆదివారము మహావైశాఖ. పర్వదినము. 2తేది నృసింహ జయంతి.

### ముహూర్తములు

తేది మేనెల 1 శుక్రవారం ఉ॥ 8.00గం.ల నుండి 10.00లోగా మిధున లగ్నము.
తేది 3 ఆదివారం ఉ॥ 10.00 నుండి 12.00లోగా కర్కాటక లగ్నం.
తేది 6 బుధవారం ఉ॥ 10.00 నుండి 12.00లోగా కర్కాటకం వివాహవ్యాపారాలు

### వైశాఖమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 01 | శుక్ర | త్రయోదశి | రా॥ గం.5.32వ॥ |
| తేది. 02 | శని | చతుర్దశి | పూర్తిగ |
| తేది. 03 | ఆది | చతుర్దశి | ఉ॥గం.7.7వ॥ |

### వైశాఖమాస కృష్ణపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 04 | సోమ | పూర్ణిమ | ఉ॥గం.8.20వ॥ |
| తేది. 05 | మంగళ | పాడ్యమి | ఉ॥గం.9.00వ॥ |
| తేది. 06 | బుధ | విదియ | ఉ॥గం.9.14వ॥ |
| తేది. 07 | గురు | తదియ | ఉ॥గం.8.54వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఆవేశం ఎక్కువ ఉంటుంది కాబట్టి తగ్గించుకొని మంచి ఆలోచనలతో నిర్ణయాలు చేస్తారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. క్రొత్త వ్యాపారాలలో పెట్టుబడులకు, వ్యాపార విస్తరణకు అనుకూలం. అదనపు ఆదాయ మార్గాలకై ప్రయత్నాలు చేస్తారు. చిన్న వ్యాపారులకు, చిన్న పరిశ్రమ యజమానులకు ఆదాయం బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు చేస్తారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలలో అంది వచ్చిన అవకాశాన్ని ఉపయోగించుకొనడం మంచిది. ఆర్థికపరమైన ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. జాగ్రత్త పడటం మంచిది. వృత్తివ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. వ్యాపార అవకాశాలు చేజారిపోవచ్చును. పిల్లల విద్యా వివాహ ప్రయత్నాలు బాధ కలిగించవచ్చును. సొంత నిర్ణయాలతో ముందుకు సాగండి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఆకస్మిక వస్తు లాభం, ప్రయాణాలు ఉండగలవు. ఉద్యోగులకు బాధ్యతల గూర్చిన సంతృప్తి పురస్కారాలుంటాయి. ఉద్యోగార్థులకు అనుకోని అవకాశాలు దొరకగలవు. కష్టమనుకున్న పనులు సులువుగా జరుగుతాయి. ఆర్థికపరంగా తీసుకొన్న నిర్ణయాల వల్ల కలిసి వస్తుంది. అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. కుటుంబ సమస్యలపై తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపార వృద్ధికి పథకాలు ప్రణాళికలను నిర్ణయం చేస్తారు. కొన్ని విషయాలను చూచి చూడనట్లు పోతే పనులు అనుకున్నవి జరుగుతాయి. చిన్న పరిశ్రమలు, చిన్న వ్యాపార యజమానులకు ఆదాయం పెరుగుతుంది. పట్టుదలకు పోకుండా ఎదుటివారు చెప్పే విషయాలలో ఆంతర్యాన్ని గ్రహించండి. కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

మాటలు, చేష్టలతో తొందరపాటు వల్ల తగాదాలు రాగలవు జాగ్రత్తపడండి. ఉద్యోగులకు అధికారుల, సహచరుల సహకారం బాగుంటుంది. వృత్తి వ్యాపార పరంగా అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. భాగస్వామ్య వ్యవహారాలలో జాగ్రత్త అవసరం. హామీలు, మధ్యవర్తిత్వాలు చేయవద్దు. షేర్లు నష్టాలలో ఉండవచ్చును. విద్యా ప్రగతి బాగుంటుంది. నిరుద్యోగులకు ప్రయత్నాలు అనుకూలించగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వ్యాపారులు, కాంట్రాక్టర్లు, కమిషన్ ఏజెంట్లకు అవకాశాలు బాగుంటాయి. ఉద్యోగులకు అధికారులతో మంచి సంబంధాలు ఏర్పరచుకొంటారు. అనుకున్న పనులందు ఆటంకాలు చిక్కులుండి ఇతరుల సహకారంతో ముందుకు సాగుతారు. పరిస్థితులు గమనించి, కోపం పట్టుదలను తగ్గించుకొని వ్యవహరించండి. ఆదాయం బాగుంటుంది.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

పబ్లిక్‌తో సంబంధాలు బలపడటం, ప్రముఖులతో పరిచయాలు, సరైన సలహాలు ఇతరులకు ఇవ్వడం జరుగుతుంది. వ్యాపార భాగస్వామ్యాలు, క్రొత్త కాంట్రాక్టులు, వ్యాపార లీజులకు అవకాశాలు దొరకవచ్చును. అనుకున్న పనులు సమర్థవంతంగా పూర్తి చేసికొనగలరు. అనుకోని అదనపు ఆదాయం, దూర ప్రయాణాలుంటాయి. ఆర్థిక వ్యవహారాలు పరిష్కారం కాగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

అవసరాలకు ఋణాలు లభించగలవు. రావలసిన బాకీలు వసూలు కాగలవు. ఉద్యోగ నిర్వహణలో పని భారం సమర్థత బాగుంటుంది. ఆదాయం వ్యయాలు సరిపోతుంటాయి. బంధువుల రాకపోకలుంటాయి. వృత్తి వ్యాపారాలలో క్రొత్త పథకాలు పెట్టి ఆర్థికస్థితిని బాగు పరచుకొంటారు. అనుకున్న పనులు సవ్యంగానే సాగుతాయి. ఆరోగ్యం బాగుంటుంది.

# జనాభాకు తగ్గట్లు కోర్టులు పెరగలేదు

### రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్

దేశ జనాభా 120కోట్లకు దాటిపోయినా కోర్టుల సంఖ్య మాత్రం 14వేలకు మించలేదని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి సి.ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు ఆర్టీసీ బస్టాండు వద్ద గల డిఎస్ఆర్ కల్యాణ మండపంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో జరిగిన 7వ జిల్లా సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ కోర్టుకు వచ్చే వివిధ కేసుల సత్వర పరిష్కారానికి న్యాయమూర్తులు, న్యాయవాదులు కృషి చేయాలన్నారు. మరో ముఖ్యఅతిథి, మాజీహైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జి.ఎతిరాజులు మాట్లాడుతూ కొత్తగా వచ్చే న్యాయవాదులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సభ్యులు మాట్లాడుతూ రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ, ఆంధ్రకు ప్రత్యేక హైకోర్టులు త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

# నేత్రదానం



నెల్లూరు, సంతపేటకు చెందిన కొమ్మూరు వెంకట రమణయ్య(72) ఏప్రిల్ 26వ తేదీన మరణించారు. ఆయన కుటుంబసభ్యుల కోరిక మేరకు వాసవి క్లబ్, ది నెల్లూరు డిస్ట్రిక్ట్ హోల్‌సేల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మోడరన్ ఆసుపత్రి వారు ఆయన నేత్రాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో నేత్రదాన మోటివేటర్ బయ్యా ప్రసాద్, లీలామోహన్‌రావు, అశోక్, మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

# అక్రమార్కుల పాపం పండింది

"ప్రీమియంలపై పైసలేరు కుంటున్నారు' అనే శీర్షికపై ఏప్రిల్ 17వ తేదీ 'లాయర్'లో వచ్చిన వార్తపై ఆ సంస్థ ఉన్నతాధికారులు స్పందించినట్లుగా తెలుస్తోంది. ఒక ఆఫీసరును కాకినాడకు, మరో ఆఫీసరును చిలకలూరిపేట ఆఫీసులకు బదిలీ చేసినట్లుగా సమాచారం. ఈ ఇద్దరు ఆఫీసర్లు సంస్థ హెడ్డాఫీసుకు వెళ్ళి, బదిలీలను ఆపడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. మరో అవినీతి అధికారి క్రమశిక్షణ చర్యల నుండి తప్పించుకున్నట్లు తెలుస్తోంది. ఈ కుర్రకారు చేరీ చేరకముందే ఇంత అవినీతికి ఆలవాలమైతే, కొద్ది సంవత్సరాలకు కంపెనీని పూర్తిగా ముంచి సోదిలోకి లేకుండా చేస్తారని ఉద్యోగులు చెవులు కొరుక్కుంటున్నారు. స్టేట్ గవర్నమెంటులో అయితే ఈపాటికి ఇటువంటి అధికారులను డిస్మిస్ చేసి ఉండేవారని, ఇది కేంద్రప్రభుత్వ ఆధీనంలో వున్న సంస్థ కాబట్టి, వీరి ఆటలు ఇంకా సాగుతున్నాయని, వీరిపై కఠినమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఏజెంట్లు, ఖాతాదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయండి

### - ఎమ్మెల్యే అనిల్



ఏప్రిల్ 27న నెల్లూరు నగరంలోని శెట్టిగుంటరోడ్డు ప్రాంతంలో నిర్మిస్తున్న నూతన బ్రిడ్జిని నగర శాసనసభ్యులు డా॥ పి.అనిల్‌కుమార్‌యాదవ్ పరిశీలించి త్వరగా బ్రిడ్జి నిర్మాణమును పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు మూడు నెలల నుంచి రైతాంగానికి నీరు వదలడం వల్ల బ్రిడ్జి పనులు ఆగిపోయాయని, ప్రస్తుతం వదిలిన నీళ్లు ఆగిపోవడం, ఇంకా ఈ ప్రాంతం రద్దీగా వుండడం, ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా వున్నాయి కాబట్టి ఇక్కడ బ్రిడ్జిని వీలైనంత త్వరగా పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించడం జరిగిందన్నారు. రెండు, మూడు రోజుల్లో ఇక్కడ బ్రిడ్జి పనులు ప్రారంభించి నెల రోజుల లోపల నిర్మాణం పూర్తి చేయగలమని అధికారులు చెప్పారన్నారు. అదే విధంగా బ్రిడ్జికి ఇరువైపులా 10మీటర్ల చొప్పున రిటైనింగ్ వాల్స్‌ను ఏర్పాటు చేయమని అధికారులకు చెప్పడం జరిగిందన్నారు. స్టోన్‌హౌస్‌పేట నుంచి వచ్చే ట్రాఫిక్ శెట్టిగుంటరోడ్డు వైపు వస్తోందని, దీనివల్ల ఇబ్బందులు వస్తున్నాయని స్థానికులు తెలిపారని, కావున నెలరోజుల్లో బ్రిడ్జి నిర్మాణం నాణ్యతా ప్రమాణాలతో పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్లు ఓబిలి రవిచంద్ర, గోగుల నాగరాజు, దేవరకొండ అశోక్, నాయకులు వందవాశి రంగ, వేలూరు మహేష్, సంక్రాంతి కళ్యాణ్, అడపా శ్రీధర్, కార్పొరేషన్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌కౌంటర్ కేసును త్వరగా విచారించాలి

### ----------- కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి



తమిళ కూలీల ఎన్‌కౌంటర్ కేసును త్వరగా విచారించేందుకు ప్రత్యేక న్యాయస్థానాన్ని ఏర్పాటు చేయాలని తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గత నెల 25వ తేదీన నెల్లూరులో ఆయన మాట్లాడుతూ ఎన్‌కౌంటర్ కారణంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌ల మధ్య వందేళ్లుగా వున్న సంబంధాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో మాలైవాక్కం ప్రాంతంలో బిల్డింగ్ కూలిపోతే శిథిలాల్లో చిక్కుకుని మరణించిన 38మంది తెలుగువాళ్లను తమిళనాడు ప్రభుత్వం ఎంతగానో ఆదుకుందన్నారు. ఎన్‌కౌంటర్‌ను తమిళ రాజకీయపార్టీలు,తమిళ సంఘాలు బూటకపు ఎన్‌కౌంటర్, తెలుగువాళ్లు చేసిన సామూహిక హత్యగా నిందిస్తున్నాయన్నారు. చిత్తూరు, నెల్లూరుజిల్లాల నుంచి వ్యాపారం నిమిత్తం వేలమంది రోజూ తమిళనాడుకు వెళ్తుంటారని, ఎన్‌కౌంటర్ కారణంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. ప్రస్తుతం చదువుకుంటున్న, చదువుకునేందుకు వచ్చే విద్యార్థుల భవిష్యత్తుపై ఇది ప్రభావం చూపుతుందన్నారు.

### నేరచరిత్ర కలిగిన వారిలో

# మార్పు రావాలి!

**గూడూరు పట్టణ సిఐ టి.వి.సుబ్బారావు**

నేరచరిత్ర కలిగిన వారిలో మార్పులు వస్తే రౌడీషీట్ తొలగిస్తామని గూడూరు పట్టణ సిఐ టి.వి.సుబ్బారావు తెలిపారు. పట్టణంలో రౌడీషీటర్లతో ఇటీవల ఆయన ఒకటో పట్టణ పోలీసుస్టేషన్లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. చెడు నడత కలిగిన వారికే రౌడీషీట్ తెరుస్తారని, గతంలో ఎలాగైతే నేరాలు చేసి ఉంటారో అలాగే చేస్తుంటే వారిపై ఎటువంటి చర్య లైనా తీసుకునేందుకు వెనుకాడమన్నారు. దొంగతనాలు, ఘర్షణలకు వెళ్లకుండా కుటుంబంతో సంతోషంగా గడపాలని, అలాకాకుండా ఘర్షణలకు పోతుంటే కుటుంబసభ్యులు ఎంతో బాధపడతారన్నారు. సమాజంలో మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై బాబీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పట్టణ సిఐ సుబ్బారావు, పక్కన ఎస్సై బాబి

# అలక్ష్యం వహిస్తే సహించేది లేదు

**సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి**

ప్రజాసమస్యలపై ప్రభుత్వ సిబ్బంది అలక్ష్యం వహిస్తే సహించేది లేదని, సిబ్బంది తీరును ఉపేక్షించకుండా ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని నెల్లూరుజిల్లా సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. సోమవారం తడ తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని, పలువురు అధికారులు సమావేశంలో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో నెలకొన్న త్రాగునీరు, రేషన్‌కార్డులు, పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను గురించి తహశీల్దార్ ఏడుకొండలు, ఎంపిడివో రమణయ్యను అడిగి వివరాలను తెలుసుకున్నారు. పట్టాదారు పాసుపుస్తకాల విషయంలో నాన్చుడు ధోరణి సరికాదన్నారు.

ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ పార్టీ నాయకులు కె.రఘు, ఆర్.కె.సుందర్‌రెడ్డి, గండవరం సురేష్‌రెడ్డి, ఎ.మునుస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారత ఇదేనా?

**- జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అరుణమ్మ**

అంగన్‌వాడీలను ఉద్యోగాల నుంచి తొలగించడమేనా మహిళా సాధికారత అంటే అని నెల్లూరుజిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పందిళ్లపల్లి అరుణమ్మ ప్రశ్నించారు.



సోమవారం నెల్లూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలేదీక్షలకు ఆమె సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు. రిలేదీక్షలకు బిటిఎ, పిఆర్‌టియూ నాయకులు సంఘీభావం తెలిపారు. యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధానకార్యదర్శులు శేషమ్మ, స్వరూపరాణి, సిఐటియూ జిల్లా నాయకులు అజయ్‌కుమార్, సిపిఎం రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాదాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## కాలధర్మం

# కలికి వెంకురెడ్డి



నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం కొత్తూరు వాసి, బెంగుళూరు నివాసి బాలాజీ వేర్ హౌసింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత కలికి కోదండరామిరెడ్డి తండ్రి కలికి వెంకురెడ్డి ఏప్రియల్ 29వ తేదీ బుధవారం నాడు బెంగుళూరులో పరమపదించారు.

నిండు నూరేళ్ళు ఆయన పరిపూర్ణ జీవితాన్ని గడిపారు. ఇందుకూరుపేట కొత్తూరులో శ్రీ షిరిడి సాయిబాబా, శ్రీ యోగాంజనేయ ఆలయాలను నిర్మించి వేలాది మంది భక్తులకు ఆధ్యాత్మిక ప్రశాంతతను అందిస్తున్న కలికి కోదండరామిరెడ్డి గురించి తెలియనివారుండరు. ఇటీవలే ఈ ఆలయాల్లో ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలను అత్యంత వేడుకగా నిర్వహించారు. వెంకురెడ్డి అంత్యక్రియలు గురువారం కొత్తూరులో జరిగాయి. కలికి కోదండరామిరెడ్డి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపు తోంది 'లాయర్'.

# బ్యాడ్మింటన్ శిక్షణ శిబిరాలు ప్రారంభం

నెల్లూరు జిల్లాలోని గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల్లోని బాలబాలికలను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు జిల్లా బ్యాడ్మింటన్ క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. నెల్లూరు ఏసి సుబ్బరెడ్డి క్రీడాప్రాంగణంలోని ఇండోర్ స్టేడియంలో గత నెల 28న విలేకర్లతో మాట్లాడుతు జిల్లా క్రీడ సాధికార సంస్థ, రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్, సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ సహకారంతో వేసవి ఉచిత శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఏసీ సుబ్బరెడ్డి క్రీడా ప్రాంగణంలోని ఆనం వెంకటరెడ్డి ఇండోర్ స్టేడియంలో, మిని బైపాస్ రోడ్డు ఇస్కాన్ మందిరం సమీపంలో రోషన్ ఇండోర్ స్టేడియంలో ప్రతిరోజు ఉదయం 6 నుంచి 9, సాయంత్రం 5 నుంచి8 గంటల వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏసీ సుబ్బరెడ్డి క్రీడాప్రాంగణంలో శిక్షణకు సంబంధించి కోచ్ ప్రదీప్ 94944 93339, రోషన్ ఇండోర్ స్టేడియంలో శిక్షణ కోసం ప్రీతమ్ 9949797679 లను సంప్రదించాలన్నారు. జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో ఇవ్వనున్న శిక్షణ వివరాల కోసం ఆర్గనైజర్ దశయ్య 9949191977ను సంప్రదించాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు ఆకాష్ చౌదరి, ఉపాధ్యక్షుడు ఎం.ప్రసాదరావు పాల్గొన్నారు

# మహాత్ముల విగ్రహాల ఆవిష్కరణ

నెల్లూరుజిల్లా పొదలకూరు పట్టణంలో మహాత్మా జ్యోతిరావు పూలే, బాబు జగ్జీవన్‌రామ్, డా॥ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలను సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రకాశం జిల్లా సంతనూతలపాడు ఎమ్మెల్యే ఆదిమూలపు సురేష్‌లు ఆదివారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ మహాత్ముల ఆశల సాధన కోసం కష్టపడి పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పొదలకూరు మండలాధ్యక్షుడు బ్రహ్మయ్య, సర్పంచ్ నిర్మలమ్మ, జడ్పీటీసీ బిరదవోలు మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# నరశింహులుకి సంతాపం

ఏపియుడబ్ల్యూజే నెల్లూరుజిల్లా శాఖ మాజీఅధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్ సి.హెచ్.నరశింహులు మృతికి గత నెల 24వ తేదీన నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో పలువురు జర్నలిస్టులు సంతాపం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రభ, ఆంధ్రభూమి దిన పత్రికల్లో మూడు దశాబ్దాల పాటు నెల్లూరుజిల్లా నాయుడుపేట విలేకరిగా పనిచేసిన నరశింహులు, గ్రామీణ విలేకరుల సమస్యలపై స్పందించి పనిచేసారు. ఈ సందర్భంగా నరశింహులు చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# బిఎస్ఎన్ఎల్ బంపర్ ఆఫర్

వినియోగదారులకు బిఎస్ఎన్ఎల్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. మే నెల 1వ తేదీ నుంచి ల్యాండ్ ఫోన్ ద్వారా రాత్రి 9గంటల నుండి ఉదయం 7గంటల వరకు దేశవ్యాప్తంగా ఏ ల్యాండ్ ఫోన్‌కైనా, మొబైల్‌కైనా ఉచితంగా కాల్ చేసుకోవచ్చు. గత నెల 27వ తేదీన బిఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ వెంకటనారాయణ విలేకర్లతో మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలో వినియోగదారులు గంటల తరబడి మాట్లాడినా ఏలాంటి బిల్లు పడదన్నారు. కొత్త కనెక్షన్ పొందే వినియోగదారులకు కూడా ఈ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు.

# నేపాల్... నేలపాలు

(మొదటిపేజీ తరువాయి)

హిమాలయాల్లో వున్న నేపాల్‌కు ఎన్నో విశిష్టతలున్నాయి. పొరుగుదేశమే అయినా, భారతీయులందరూ నేపాల్‌ను తమ సొంతదేశంగానే భావిస్తుంటారు. హిందూ సంస్కృతికి, సంప్రదాయాలకు ఆలవాలమైన దేశంగా వుండడమే అందుకు ప్రధాన కారణం. హిమాలయ పర్వత శ్రేణుల్లో వున్న నేపాల్‌కు ప్రధాన వనరుగా వుండేది పర్యాటక రంగమే. నిత్యం ప్రపంచవ్యాప్తంగా వేలాదిమంది యాత్రికులు నేపాల్‌కు వస్తుంటారు. హిమాలయ సోయగాలను, ప్రకృతిశోభలతో అలరారే ఆ పర్వతగిరుల అందచందాలను తిలకించి పులకిస్తుంటారు. అంతేకాదు, మొత్తం ఈ భూగోళంలోనే 8848 మీటర్ల ఎత్తయిన ఎవరెస్ట్ శిఖరం వుండేది నేపాల్‌లోనే. ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించాలనే ఉత్సాహంతో ప్రపంచం నలుమూలల నుంచీ వచ్చే పర్వతారోహకులంతా నేపాల్‌కే వస్తుంటారు. ప్రపంచంలోని ఎత్తయిన 10పర్వతాల్లో 8 పర్వతాలు నేపాల్‌లోనే వుండడం మరో విశేషం. కనుకనే దీనికి పర్వతరాజ్యం అని కూడా పేరుంది.

అంతేకాదు, ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఎన్నో హిందూ దేవాలయాలకు నేపాలే నెలవు. 264 హెక్టార్లలో విస్తరించి వున్న ప్రఖ్యాతమైన పశుపతినాధ్ ఆలయం సముదాయం వుండేదీ నేపాల్‌లోనే. నేపాల్ రాజధాని ఖాట్మండులోని భాగమతి నదికి 5 కిలోమీటర్ల దూరంలో వున్న ఈ ఆలయ సముదాయంలో ఎంతో విశిష్టమైన 518 దేవాలయాలున్నాయంటే ఎంతైనా ఆశ్చర్యమే. అద్భుతమైన శిల్పారామాలతో యాత్రికులందరినీ బాగా ఆకట్టుకునే ఈ ఆలయాన్ని సందర్శించేవారి సంఖ్య రోజురోజుకీ గణనీయంగా పెరుగుతూనే వుంటుంది. ఈ ఆలయ సముదాయంలోనే మరో విశిష్టమైన శివాలయం వుంది. అందులో 184 శివలింగాలు కొలువుదీరి వుంటాయి. యాత్రికులను భక్తిభావ సమన్వితులను చేసే ఈ ఆలయ సముదాయం నేపాల్‌లో ఆధ్యాత్మికత్వానికే కట్టిన కోవెలగా వుంటుందంటే అతిశయోక్తి కాదు. ఇంకా రామమందిరం, 12 జ్యోతిర్లింగాలతో వెలసివున్న ఆదిశక్తి పీఠం(గుహేశ్వరీ దేవాలయం)... ఇలాంటి విశిష్ట మందిరాలెన్నో వున్నాయి. సీతాదేవి పుట్టినిల్లుగా, గౌతమబుద్ధుడు పుట్టిన ప్రాంతంగా కూడా నేపాల్ మరెంతో ప్రసిద్ధి చెందింది. ప్రపంచ ప్రసిద్ధి చెందిన లుంబిని బౌద్ధక్షేత్రం నేపాల్‌లోనే వుంది. ఇంతటి ప్రఖ్యాతమైన ఆలయాలకు, చారిత్రిక ప్రాంతాలకూ నెలవైన నేపాల్‌ను మహాభూకంపం గడగడ వణికించినా, అదేమి చిత్రమో కానీ పరమ పవిత్రమైన పశుపతినాధ్ ఆలయ పరిసరాల్లో మాత్రం భూకంపం ఛాయలు లేకపోవడం ఎంతైనా ఆశ్చర్యమే. కాగా, పొరుగుదేశమైన నేపాల్‌ను ఈ కష్టకాలంలో అన్నివిధాలా ఆదుకునేందుకు భారత్ తక్షణ చర్యలు చేపట్టడం సంతోషదాయకం.

ఇప్పటికే భూకంపం ధాటికి వేలాదిమంది ప్రాణాలు పోగొట్టుకోవడం, మరెన్నో వేలమంది క్షతగాత్రులు కావడం జరిగింది. భవనాల శిథిలాల్లో ఇంకా మరెన్నో మృతదేహాలున్నట్లు భావిస్తున్నారు. మృతుల కుటుంబాల శోకం ఎవరూ తీర్చలేనిది. అయినా, ఈ కష్టకాలంలో భారత్ నేపాల్‌కు పూర్తిస్థాయిలో అండదండలందిస్తూ వుండడం ముదావహం. ఏదేమైనా, ఈ భూకంప విలయానికి అన్నివిధాలా పూర్తిగా నష్టపోయిన నేపాల్ అందరి సహకారంతో త్వరలోనే కోలుకుంటుందని ఆశిద్దాం!..

# కనపడని 'ప్రత్యేక' శ్రద్ధ

(మొదటిపేజీ తరువాయి)

పొంగిపోయారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే అన్యాయానికి గురైన ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరుగుతుందనుకున్నారు. తీరా ఇప్పుడు చూస్తే జరుగుతుందొకటీ! విభజన ద్వారా కాంగ్రెస్ ఏపిని మోసం చేస్తే, ఇప్పుడు విభజన హామీలను విస్మరించడం ద్వారా బీజేపీ మోసం చేస్తుంది. ముఖ్యంగా ప్రత్యేకహోదా విషయంలో బీజేపీ పిల్లిమొగ్గలేస్తుంది. ఏపికి ప్రత్యేక హోదా ఇవ్వడానికి ఇతర రాష్ట్రాలు ఒప్పుకోవడం లేదనే సాకు చెబుతుంది. మరి అన్ని రాష్ట్రాలు ఒప్పుకుంటేనే రాష్ట్ర విభజన చేసారా? అనేది ప్రశ్న.

బీజేపీ ఏపికి ప్రత్యేకహోదా కల్పించే విషయాన్ని నాన్చడం వెనుక రాష్ట్ర రాజకీయ భవిష్యత్ ప్రణాళిక ప్రధానంగా కనిపిస్తుంది. రాష్ట్రంలో బలం పెంచుకోవాలని బీజేపీ అధిష్ఠానం భావిస్తుంది. ఇప్పుడు రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తే ఇది నేనే తెచ్చానని చంద్రబాబు చెప్పుకుంటాడు. మిత్రపక్షంగా ఉంది కాబట్టి బీజేపీ కూడా అడ్డం మాట్లాడలేదు. కాబట్టి ప్రత్యేక హోదా ఇప్పుడిచ్చినా రాజకీయంగా బీజేపీకి వచ్చే ప్రయోజనమేమీ లేదు. అందుకే ముందు విభజన హామీలను అమలు చేయకపోతే తెలుగుదేశం బీజేపీకి వ్యతిరేకమవుతుంది. మిత్రపక్షం కాస్తా శత్రుపక్షమవుతుంది. బీజేపీతో తెగదెంపులు చేసుకుంటుంది. అప్పుడు బీజేపీయే నేరుగా ప్రత్యేక హోదా వంటి వాటితో పాటు ఏపికి ప్రత్యేక వరాలివ్వడం ద్వారా రాష్ట్రంలో సొంతంగా బలాన్ని పెంచుకోవాలనేది బీజేపీ అధిష్ఠానం వ్యూహం. ప్రస్తుతం ఆ పార్టీ రాష్ట్రంలో ఈ ప్రణాళికనే అమలు చేస్తున్నట్లు కనపడుతుంది.

గల్పిక

# రాహుల్ రాకతో బీజేపీలో సంబరాలు

అది అత్యాచారాలు లేని నగరంగా గుర్తింపు పొందిన దేశ రాజధాని న్యూఢిల్లీ. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఉండే టెన్‌జనపథ్ నివాసం. అక్కడంతా కోలాహలంగా వుంది. కాంగ్రెస్ జెండాలు రెపరెపలాడుతున్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అక్కడ గుమికూడి వున్నారు. కాంగ్రెస్ పెద్దలు మన్మోహన్‌సింగ్, ఏ.కె.ఆంటోని, గులాంనబీ ఆజాద్, వీరప్పమొయిలీ, చిదంబరం, అంబికాసోని, పనబాక లక్ష్మి, జైపాల్‌రెడ్డి, మనీష్ తివారీ, దిగ్విజయ్‌సింగ్, అహ్మద్‌పటేల్ వంటి వారంతా అక్కడే వున్నారు. ఆ వీధిలో అంతా విదేశాల పర్యటన పూర్తి చేసుకుని వస్తున్న రాహుల్‌గాంధీకి స్వాగతం పలుకుతున్న ఫ్లెక్సీ కటౌట్‌లను ఏర్పాటు చేసి వున్నారు. వచ్చిన వాళ్లందరినీ వి.హెచ్.హనుమంతరావు, పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, మధుయాష్కీలు టిఫిన్‌లు చేసారా, కాఫీలు తాగారా అంటూ అతిథి మర్యాదలు చేయసాగారు. సోనియాగాంధీ కళ్లార్పకుండా రోడ్డు వైపే చూడసాగింది. సోనియాతో అంబికాసోని వుండి... మన రాహుల్‌బాబు లేని ఈ నెల రోజులు మన పార్టీకి ఒక యుగంగా నడిచింది మేడమ్, అయినా ఇన్నిరోజులు రాహుల్‌బాబు ఎక్కడెక్కడ తిరిగినట్లు అని అడిగింది. అది విని ఆ పక్కనేవున్న స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరు మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(64) వెంటనే రియాక్టయ్యాడు. ఆ... అన్నీ మీకు చెబుతారు మేడమ్, పెళ్లికాని పిల్లోడు, అతనికి ఎన్ని ప్రాబ్లమ్స్ ఉన్నాయో ఏంటో, అవన్నీ మనకు చెప్పుకోలేడుగా, ఆ ప్రాబ్లమ్స్‌ను పరిష్కరించుకోవడానికే అప్పుడప్పుడు విదేశాలకు వెళుతుంటాడు. ఇక రాహుల్‌కు పెళ్లి చేసేయండి మేడమ్, పెళ్లాం వచ్చిందంటే చచ్చినట్టు ఇంటి పట్టాన పడివుంటాడు. ఇక విదేశాలకు పోవాలనే కోరిక కూడా చచ్చిపోద్ది అని చెప్పాడు. అంతలో బయట రెండు కార్లు వచ్చి ఆగాయి. ఒక కారులో నుండి రాహుల్‌గాంధీ అడుగు బయట పెట్టాడు. అంతే, కాంగ్రెస్ కార్యకర్తలు భారీగా బాణాసంచా కాల్చడం మొదలుపెట్టారు. సన్నివేశానికి తగ్గట్లుగా వుంటుందని వి.హెచ్.హనుమంతరావు సి.డి ప్లేయర్ ఆన్ చేసి 'మిర్చి' సినిమాలో 'పండుగలా దిగివచ్చావు... ప్రాణాలే నిలబెట్టావు' అనే పాట పెట్టాడు. నాయకులు, కార్యకర్తలు ఆ పాటకు డ్యాన్స్ చేస్తూ రంగులు చల్లుకుంటూ రాహుల్‌ను లోపలకు తీసుకెళ్లసాగారు. కరెక్ట్‌గా గుమ్మం వద్ద సోనియాగాంధీ ఎరుపునీళ్లతో దిష్టితీసి లోపలకు రమ్మంది. రాహుల్‌తో పాటు అందరూ లోపలకు వెళ్లారు. అక్కడే ఒక హాల్‌లో రాహుల్‌కు స్వాగత సన్మానం ఏర్పాటు చేశారు. అందరూ హాల్‌లో కూర్చున్నారు. మొదట మన్మోహన్‌సింగ్ మాట్లాడుతూ... కాంగ్రెస్‌కు వున్న ఏకైక రామబాణం మన రాహుల్‌గాంధీ. ఆయన నాయకత్వంలో పనిచేయడానికి ఈ దేశం ఎదురు చూస్తుంది. ఈ దేశాన్ని బాగుచేయగల సత్తా ఆయనకే వుంది. అందుకే ఆయన విదేశాలలో తిరుగుతూ పరిపాలనా అనుభవాన్ని పెంచుకుంటున్నారు. ఇండియాలో పుట్టిపెరిగిన వాళ్లు పాలిస్తే కేవలం ఇండియన్ తరహాపాలన మాత్రమే చేయగలరు. అదే అన్ని దేశాలు తిరిగొస్తే, ఆ దేశాలలో వున్న పరిపాలనా విధానాలను కూడా ఇక్కడ అమలు చేయగలరు. అందుకే రాహుల్ బాబు పార్లమెంటుకు, పార్టీకి సెలవుపెట్టి మరీ విదేశీయాత్రలు చేసొచ్చాడన్నారు. తర్వాత సోనియాగాంధీ మాట్లాడుతూ... మా నెహ్రూ తాత, మా అత్త ఇందిర, నా భర్త రాజీవ్ ఈ దేశం కోసమే పని చేశారు. వారి బాటలోనే నా బిడ్డను నడిపిస్తున్నాను, రాహుల్‌కు ఎప్పుడూ ఈ దేశ ప్రజలు, ముఖ్యంగా పేదలంటే యావ, ఈ దేశంలో పేదరికాన్ని ఎలా తొలగించాలనే దానిపై అధ్యయనం చేసేందుకు విదేశాలు తిరిగొస్తానన్నాడు. ఎవరైనా తిరిగితేనే కదా జ్ఞానం పెరిగేది. అందుకే ఆయనను విదేశాలకు పంపించాను అని చెప్పింది. చివరగా రాహుల్‌గాంధీ మాట్లాడుతూ... విదేశాల నుండి మనం నేర్చుకోవాల్సింది చాలా వుంది. అక్కడ ఎవరి పని వాళ్లే చేసుకుంటారు. ఎవరి బాత్రూమ్‌లు వాళ్లే కడుక్కుంటారు. ఎవరి గుడ్డలు వాళ్లే ఉతుక్కుంటారు. ప్రజలు చాలా క్రమశిక్షణగా ఉంటారు. ముఖ్యంగా ప్రజలంతా కష్టపడి పనిచేస్తుంటారు. మన దేశంలో లాగా ఫ్రీ పథకాలేవీ ఉండవు. మనం ఎప్పటి నుండో ఆ విధానాలను అమలు చేసి వుంటే ఈ దేశం ఇంకా ఎంతో ముందుకు పోయి ఉండేదని చెబుతుండగా, దిగ్విజయ్‌సింగ్ మెల్లిగా... రాహుల్ బాబూ మరీ అంత లోతుకుపోకు, గతాన్ని తవ్వితే అక్కడ అంతా మన పార్టీయే వుండేది, మీ మాటలతో గబ్బుపట్టేది మనమే అని హెచ్చరించాడు. దాంతో రాహుల్... ఆ సబ్జెక్టును వదిలేసి, దేశం కోసం అవసరమైతే నెలకొసారైనా విదేశీ పర్యటనలకు పోతుంటానని చెప్పి కూర్చున్నాడు. తర్వాత అందరూ భోజనాలు చేసి ఎవరిదారిన వాళ్లు వెళ్లిపోయారు.

అరగంట తర్వాత ఆ హాల్‌లో సోనియా, రాహుల్, మన్మోహన్‌సింగ్‌లు మిగిలారు. ఉన్నట్లుండి రాహుల్, సోనియా కాళ్ల మీద పడిపోయి నన్ను క్షమించమ్మా, ఇక ఎప్పుడూ నీకు చెప్పకుండా ఇంట్లో నుండి అలిగి పోను. నాకు బుద్ధొచ్చింది, విదేశాలలో తిరిగితే కాని నీ విలువేంటో నాకు తెలిసిరాలేదు. అక్కడ మన పనులను మనమే చూసుకోవాలి, అసలు మనల్నెవరూ పట్టించుకోరు. కాని ఇక్కడ చూస్తే అడగకుండానే అన్నీ ఇచ్చావు. వాడుకోవడానికి కాంగ్రెస్‌పార్టీనిచ్చావు, ఆడుకోవడానికి కాంగ్రెస్ నాయకులనిచ్చావు, పెట్టుకోవడానికి ఖద్దరుటోపీనిచ్చావు, వేసుకోవడానికి లాల్చీ పైజామా ఇచ్చావ్, ఊరూరా తిరగడానికి పదవినిచ్చావ్, నా లోపాలను భరించి నెత్తినేసుకునే కేడర్‌నిచ్చావ్... అందుకే నువ్వు నాకు నచ్చావ్ మామ్... అంటూ సోనియా కాళ్లు గట్టిగా పట్టుకుని వెక్కివెక్కి ఏడవసాగాడు. సోనియాగాంధీ అతనిని పైకిలేపింది. అక్కడేవున్న మన్మోహన్‌సింగ్... నీ తల్లి విలువను ఇప్పటికైనా తెలుసుకున్నావు. అది చాలు, ఇంకెప్పుడూ అలిగి విదేశాలకు పోకు, ఇక్కడ కవర్ చేయలేక ఛస్తున్నాం అంటూ పాత సినిమాలలో గుమ్మడి వెంకటేశ్వరరావు మాదిరిగా కళ్లు తుడుచుకున్నాడు. అంతలో వి.హెచ్.హనుమంతరావు పరుగెత్తుకుంటూ లోపలకు వచ్చి టివి ఆన్ చేసి టివి10.5 ఛానెల్ పెట్టాడు. దాంట్లో ఢిల్లీలోని బీజేపీ కార్యాలయం వద్ద సీన్‌లు కనపడుతున్నాయి. బయట కార్యకర్తలు బాణాసంచా కాలుస్తుంటే లోపల నరేంద్ర మోడీ, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షా, వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీలు ఒకరి నోట్లో ఒకరు స్వీట్లు పెట్టుకుంటూ సంబరాలు చేసుకుంటున్నారు. అది చూసి సోనియా ఆశ్చర్యంతో... అదేంటి, ఎక్కడా ఎన్నికలు జరగలేదు కదా, బీజేపీ వాళ్లు సంబరాలెందుకు చేసుకుంటున్నట్లు అని అడిగింది. దానికి వి.హెచ్... మన రాహుల్ బాబు విదేశాలలోనే ఎక్కడ ఉండిపోతాడోనని వాళ్లు భయపడ్డారు. త్వరలో బీహార్ ఎన్నికలున్నాయి కదా, ఆ ఎలక్షన్‌లకు వస్తాడో రాడోనని ఆందోళన చెందారు. ఇప్పుడు రాహుల్‌బాబు వచ్చాడని తెలియగానే వాళ్లు పండుగ చేసుకుంటున్నారు. రాహుల్ కాంగ్రెస్ సారథిగా ఉంటే... వాళ్లకు అదొక ఆనందం అని చెప్పాడు. ఆ మాటకు సోనియా, మన్మోహన్‌లు అవాక్కయ్యారు.

## కదంబం



## జెండా చెట్టు

**కె.గోపాలరావు**
నెల్లూరు. 9652174640

విచక్షణా రహితంగా
చెట్లను కొట్టేసేవాళ్ళ తలకొట్టేసినట్టు
ఈయనెవరో గాని...
వరండా స్లాబుల్లోంచే రంధ్రం చేసి
చెట్టు నట్టాగే పైకి వదిలేశాడు
పార్టీ జెండా నెగరేసినట్టు
ఇంటికి పచ్చటి తలపాగా చుట్టినట్టు.

ఆదిశేషుడు
విష్ణువుకి పడగపడుతున్నట్టు.
పచ్చదనానికి పెద్ద పీటేసే
పర్యావరణశాఖ ప్రధాన కార్యాలయంలా
ఆ ఇల్లు అచ్చం ఆయన గారి
'ఎదరిల్లు'లా ఉంది.

కొట్టేస్తే స్థలం కలిస్తొందికదాని
మా స్నేహితుడంటే,
భీష్ముడు స్త్రీని ముట్టనన్నట్టు
చెట్టుని కొట్టనని
ఒట్టేసుకున్నాడేమోనని అన్నాను.

ఏది ఏమైనా
పచ్చగా ఎదగాలనుకునేవాళ్ళంతా
గుండెలపై పెట్టుకొని
చెట్టు కలా పట్టాభిషేకం చెయ్యాలి
కొట్టేసి పొట్టన బెట్టుకోకుండా...

## యునెస్కో క్లబ్బుల ఉపాధ్యక్షునిగా కిరణశ్రీ



న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న యునెస్కో క్లబ్స్ ఆఫ్ ఇండియా జాతీయ సంస్థ ఉపాధ్యక్షుడిగా నెల్లూరు నగరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త బూతపాటి కిరణశ్రీ ఎన్నికయ్యారు. రాజస్థాన్ రాష్ట్రం అజ్మీర్ నగరంలోని మహర్షి దయానంద సరస్వతి విశ్వవిద్యాలయంలో ఏప్రియల్ 17 నుండి 21వరకు కాన్ఫెడరేషన్ ఆఫ్ యునెస్కో క్లబ్స్ అండ్ అసోసియేషన్స్ జాతీయ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 24రాష్ట్రాల నుండి 67మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో విద్వాన్ బూతపాటి కిరణశ్రీని జాతీయసంస్థకు ఉపాధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కవి నాగేశ్వరరావుకు సాహితీ పురస్కారం



నెల్లూరుజిల్లాకు చెందిన కవి, రచయిత కె.వి.నాగేశ్వరరావుకు ఇటీవల నెల్లూరు టౌన్‌హాల్‌లో జిఆర్ ట్రస్ట్ సంస్థ ఆధ్వర్యంలో గుర్రాల రమణమ్మ స్మారక సాహితీ పురస్కారం అందజేశారు. ఆయన చేసిన సాహితీసేవకు గుర్తింపుగా ఈ పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా జిఆర్‌ట్రస్ట్ అధ్యక్షులు గుర్రాల రమణయ్య వ్యవహరించారు. యద్దల లలిత, డా॥ జయప్రద, ఆచార్య ఆదిత్యులు పాల్గొన్నారు.

## గీతామయి వృద్ధుల ఆశ్రమానికి వితరణ

నెల్లూరు నగరంలోని స్మార్ట్ క్లినిక్ అధినేత డా॥ మారం సుధాకర్ కుమారుడు డా॥ మారం స్మార్ట్ ఎంబిబిఎస్ పూర్తి చేసుకున్న సందర్భంగా తన పుట్టినరోజును పురస్కరించుకుని గత నెల 25వ తేదీన బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో వృద్ధుల మధ్య పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు 5బస్తాల బియ్యం, దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. డా॥ మారం సుధాకర్ మాట్లాడుతూ ఆశ్రమంలోని వృద్ధులకు ప్రతి నెల మొదటి ఆదివారం ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహించి వారికి ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తానని తెలిపారు.

## మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా



**- ఎక్సైజ్ డైరెక్టర్ ఇ.దామోదర్**

నెల్లూరుజిల్లా కలువాయి మండలం తోపుగుంట గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ఎక్సైజ్ డైరెక్టర్ ఇ.దామోదర్ పేర్కొన్నారు. నెల్లూరు, భక్తవత్సలనగర్‌లోని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తోపుగుంట గ్రామంలో తాను పర్యటించి గ్రామ పెద్దలతో చర్చించినట్లు తెలిపారు. గ్రామంలో అవసరమైన మౌలిక సదుపాయాలు గుర్తించేందుకు 11మందితో కూడిన గ్రామవికాస సంఘాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సంఘం ఆ గ్రామంలో అవసరమైన వసతులను తన దృష్టికి తీసుకువస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తోపుగుంట గ్రామంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి జరిగేలా ప్రభుత్వంతో సంప్రదించి తనవంతు కృషి చేస్తానన్నారు. తోపుగుంట గ్రామాన్ని దామోదర్ దత్తత తీసుకొన్న విషయం విదితమే.

## భూకంప బాధితులకు యూత్‌కాంగ్రెస్ నివాళులు




నేపాల్ భూకంప మృతులకు ఆత్మశాంతి కోరుతూ నెల్లూరుజిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నెల్లూరులో కొవ్వొత్తులు వెలిగించి, పూలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినోద్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పెద్దలతో మాట్లాడి నేపాల్ భూకంప బాధితులకు అండగా నిలిచే ప్రయత్నాలను ముమ్మరం చేస్తామన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు బాధితులకు తమకు తోచిన విరాళాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేష్, చక్రధర్‌రెడ్డి, అంజయ్య, మస్తాన్‌రెడ్డి, ఉమర్, శ్రీనాథ్, మల్లి తదితరులు పాల్గొన్నారు.



## పేదల ఆసుపత్రికి...
# జివికె పెద్ద కానుక

***వైద్య రంగంలో అటు పాత తరానికి ఇటు నవతరానికి మధ్య వారధి లాంటి ఓ వైద్య కేంద్రం వుంది. అదే నెల్లూరు సంతపేటలోని సెయింట్ జోసెఫ్ హాస్పిటల్. అయితే ఈ పేరు వింటే ఆ ఆసుపత్రిలో పుట్టిన వాళ్లు కూడా ఈ ఆసుపత్రి ఎక్కడుందబ్బా అని ఆలోచనలో పడే అవకాశముంది. కాని కన్యకల ఆసుపత్రి అంటే నెల్లూరుజిల్లాలో ప్రతి ఒక్కరూ ఇట్టే గుర్తుపట్టేస్తారు.***

ఈ ఆసుపత్రితో నెల్లూరీయులకు ఎన్నో ఏళ్ల బంధం, ఎన్నో వేలమందికి జన్మసంబంధం ఉంది. అలా ఈ ఆసుపత్రితో జన్మసంబంధం ముడిపడ్డ వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త, మన నెల్లూరీయుడు, గునుపాటి వెంకటకృష్ణారెడ్డి(జివికె) ఒకరు. ప్రపంచంలోనే పెద్ద పారిశ్రామికవేత్తలలో ఒకరైన జివికె 78ఏళ్ల క్రితం కళ్లు తెరిచింది ఈ ఆసుపత్రిలోనే! కాబట్టే ఆ పుట్టిన ఋణం మరచిపోకుండా ఆయన ఈ ఆసుపత్రికి సేవ చేయాలనుకున్నారు.

దాదాపు రెండున్నర కోట్లు ఖర్చుతో ఈ ఆసుపత్రిలో రేడియాలజీ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇది పేదల ఆసుపత్రి. కాబట్టి తాను ఏర్పాటు చేసే రేడియాలజీ విభాగం కూడా పేదలకు పనికొస్తుందనే సత్సంకల్పంతో జివికె ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కన్యకల ఆసుపత్రిలో అత్యంత ఆధునిక వైద్యపరికరాలతో ఏర్పాటు చేసిన జివికె రేడియాలజీ విభాగాన్ని ఏప్రిల్ 25వ తేదీన కేంద్ర పట్టణాభివృద్ధి శాఖామంత్రి యం.వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి కామినేని శ్రీనివాస్‌తో పాటు జి.వి.కె.రెడ్డి, జి.వి.కె సంస్థల వైస్ ఛైర్మెన్ జి.వి.సంజయ్‌రెడ్డి, బిషప్ యం.డి.ప్రకాశం, నెల్లూరు మేయర్ అబ్దుల్ అజీజ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ లిల్లీపుష్పా, అడ్మిన్ సిస్టర్ బ్రిటిలియా తదితరులు పాల్గొన్నారు. రేడియాలజీ విభాగాన్ని ప్రారంభించిన అనంతరం ఆసుపత్రిలో కలతిరిగారు. జివికె తాను పుట్టిన ఆసుపత్రిని చూసుకుంటూ మైమరిచారు. ఆసుపత్రిలో పేదల వైద్యసేవల కోసం జివికె చేసిన పనిని వెంకయ్యతో పాటు అందరూ ప్రశంసించారు.

## సునామి కేంద్ర శంకుస్థాపనకు
# తుఫాన్‌లా వచ్చి వెళ్లిన చంద్రబాబు



కొన్నేసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు చూస్తుంటే అసలు ఇలాంటివాటిని విఐపిలకు బదులు సామాన్యుల చేత చేయిస్తే బాగుంటుందేమోననిపిస్తుంది. ఒక ప్రాంతంలో ఒక ప్రభుత్వ కార్యక్రమానికి శంకుస్థాపనో, ప్రారంభోత్సవమో చేయాలంటే దానికి ముఖ్యమంత్రో, మంత్రో రావాలి. మంత్రి వచ్చాడంటే ఒక మోస్తరు ఖర్చు వుంటుంది. ముఖ్యమంత్రి వచ్చాడంటే ఖర్చు వాచిపోతుంది. ఎవరు శంకుస్థాపన చేసినా జరగాల్సిన పని ఒకటే! కాబట్టి ఈ విఐపిల శంకుస్థాపన సంప్రదాయాన్ని మార్చేస్తే ప్రభుత్వానికి బోల్డంత డబ్బు ఆదా అవుతుంది.

ఏప్రిల్ 25వ తేదీన వాకాడు మండలంలోని తూపిలిపాలెం వద్ద 500కోట్లతో నిర్మించతలపెట్టిన జాతీయ మహాసముద్ర సాంకేతిక, విజ్ఞాన సంస్థకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్రమంత్రులు యం.వెంకయ్యనాయుడు, డాక్టర్ హర్షవర్ధన్, అశోక్ గజపతిరాజు, సుజనాచౌదరి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాన్ని సంబంధిత శాఖ కేంద్రమంత్రితో సింపుల్‌గా చేయించి ఉండొచ్చు. కాని ముఖ్యమంత్రిని పెట్టేసరికి శంకుస్థాపన ఖర్చు చినిగి చేటయ్యింది. ముఖ్యంగా అధికారులకు పోలీసు సిబ్బందికి శ్రమ ఎక్కువైంది. చంద్రబాబు ప్రకాశం జిల్లాలో కార్యక్రమాలు ముగించుకుని హెలికాప్టర్‌లో నేరుగా ఇక్కడకు వచ్చాడు. కార్యక్రమం చూసుకుని వెళ్లిపోయాడు. ఈ ఒక్క గంట సీఎం ప్రోగ్రాం కోసం అధికారులు నానా హడావిడి చేశారు. వందల సంఖ్యలో పోలీసులను అక్కడకు పంపించాల్సి వచ్చింది. ఇక సిఎం వస్తున్నాడు కాబట్టి ఆయన ప్రసంగించే సభలోనూ జనం నిండుగా కనిపించాలి కదా! అందుకే బస్సులు, ఇతర వాహనాలను పెట్టి డ్వాక్రా మహిళలను, విద్యార్థులను భారీగా తరలించారు. దీనికి ఖర్చు తడిసి మోపెడయ్యింది.



శంకుస్థాపన అనంతరం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కాలేజీలో బహిరంగ సభ ఏర్పాటు చేసారు. సభలో చంద్రబాబు పాత వాగ్ధానాలనే రిపీట్ చేశారు. దుగరాజపట్నం పోర్టు వస్తుందంటూ ఆశలు రేపారు. వెంకయ్యనాయుడు తన ప్రసంగంలో పారిశ్రామిక అభివృద్ధిలో నెల్లూరుజిల్లాకు మంచి భవిష్యత్ వుందని చెప్పుకొచ్చారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పి.నారాయణ, బొజ్జల గోపాలకృష్ణారెడ్డి, కామినేని శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, తెలుగుదేశం నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర, బీద మస్తాన్‌రావు, బల్లి దుర్గాప్రసాద్, వేనాటి రామచంద్రారెడ్డి, జ్యోత్స్నలత, పరసారత్నం, బీజేపీ నాయకులు నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డిలు పాల్గొన్నారు.

## సైంటిస్ట్ సతీష్‌రెడ్డికి
# ప్రతిష్టాత్మక అవార్డు



నెల్లూరీయులు గర్వించదగ్గ శాస్త్రవేత్త, ఆత్మకూరు మండలంలోని మహిమలూరు వాసి, డిఆర్‌డిఓ క్షిపణి సైంటిస్ట్ గుండా సతీష్‌రెడ్డి ప్రపంచంలోనే ప్రతిష్టాత్మకమైన 'ఫెలోషిప్ ఆఫ్ రాయల్ ఇన్సిట్యూట్ ఆఫ్ నేవిగేషన్ లండన్' అవార్డుకు ఎంపికయ్యారు. 1947లో ప్రారంభించిన ఈ ఇన్‌స్టిట్యూట్ ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా 450 మందికిపైగా నేవిగేషన్ ప్రొఫెసర్స్‌ను గుర్తించి సత్కరించింది. హైదరాబాద్‌లో డిఆర్‌డిఓ రీసెర్చ్ సెంటర్ ఇమారత్ డైరెక్టర్ అయిన సతీష్‌రెడ్డి మూడు దశాబ్దాలుగా నేవిగేషన్ రంగంలో పనిచేస్తున్నారు. 5వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేధించగల అగ్ని-5 క్షిపణి రూపకర్తలలో ఆయనొకరు. నేవిగేషన్ సిస్టమ్‌లో పలుకీలక భాగాలపై ఆయన అధ్యయనం చేశారు. ఇప్పటివరకు రష్యాకు చెందిన అకాడమీ ఆఫ్ నేవిగేషన్ అండ్ మిషన్ కంట్రోల్, రాయల్ ఏరోనాటికల్ సొసైటి(యుకె), ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్, అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోనాటిక్స్ అసోసియేట్ ఫెలోషిప్‌లను ఆయన పొంది వున్నారు.

'ఫెలోషిప్ ఆఫ్ రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నేవిగేషన్, లండన్' అవార్డుకు ఎంపికైన తొలి భారతీయుడు ఆయనే కావడం విశేషం. ప్రతిభకు పట్టాభిషేకంగా ప్రతిష్టాత్మక అవార్డును సాధించిన సతీష్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com